
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య
జిల్లా వార్తలు

5

బుధవారం 11 జూన్ 2025

అన్నమయ్య ప్రాజెక్టు పునర్‌నిర్మాణంలో కదలిక



వైసీపీ పాలనలో 2021లో వరద నీటికి కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునర్‌నిర్మాణానికి కూటమి ప్రభుత్వంలో కదలిక ఏర్పడింది. వైసీపీ నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్టును తాము పునర్‌నిర్మిస్తామని గత నెలలో కడపలో జరిగిన మహానాడు సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. దాన్ని బలపరుస్తూ.. ప్రాజెక్టు పునర్‌నిర్మాణంపై అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆరుగురు నీటిపారుదల శాఖ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. దీంతో ఇక అన్నమయ్య ప్రాజెక్టు పనులకు మోక్షం లభించినట్లేనని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- అధ్యయనానికి ఆరుగురు నిపుణులతో కమిటీ
- వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యం
- గేట్ల మరమ్మతులకు రూ.4 కోట్లు విడుదల చేయని వైఎస్ జగన్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ప్రాజెక్టు వరద నీటికి కొట్టుకుపోవడానికి ఏడాది క్రితం ప్రాజెక్టుకు ఉన్న నాలుగు గేట్లలో ఒక గేటు మరమ్మతుకు గురైంది. ఎటూ కదలకుండా.. బిగిసుకుపోయింది. దాన్ని మరమ్మతు చేయాలంటే.. సుమారు రూ.4 కోట్లు అవసరం అవుతాయని అప్పట్లో సంబంధిత అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పైసా నిధులు విదల్చలేదు. అదిగో ఇస్తాం.. ఇదిగో ఇస్తాం.. అంటూ కాలయాపన చేసింది. ఫలితంగా వరద నీటికి అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ఒక్కసారిగా పింఛా ప్రాజెక్టు తెగిపోయి.. నీళ్లన్నీ.. దిగువన ఉన్న అన్నమయ్య ప్రాజెక్టుపైన పడడం... గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో వర్షం కురవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. అధికారులు ప్రమాదాన్ని గుర్తించినప్పటికీ... ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వైసీపీ నాయకుల వందలాది టిప్పర్లను కాపాడే ఉద్దేశ్యంతో.. వైసీపీ నాయకులకు ఎదురు చెప్పలేకపోయారు. తీరా చేతులు కాలాక.. ఆకులు పట్టుకున్న చందంగా.. అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పటికీ.. మూడు మాత్రమే పైకి లేచాయి. నాల్గవ గేటు కూడా పైకి లేచి ఉంటే.. ప్రాజెక్టు కొట్టుకుపోయే ప్రమాదం తక్కువగా ఉండేదని పలువురు పేర్కొన్నారు.

జగన్ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం

2021 నవంబరు 19న తెల్లవారుజామున అన్నమయ్య ప్రాజెక్టు వరదనీటికి కొట్టుకుపోయింది. ఈ దుర్ఘటనలో 33 మంది మృత్యువాత పడ్డారు. వేలాది పశువులు చనిపోగా.. వేల ఎకరాల పొలాలు నీట మునిగిపోయాయి. వైసీపీ నాయకుల ఇసుక వ్యాపార దాహానికి ప్రాజెక్టు కొట్టుకుపోయినప్పటికీ.. తర్వాత సుమారు రెండన్నర సంవత్సరాలు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం.. ప్రాజెక్టు పునర్‌నిర్మాణానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. సర్వే పేరుతో కాలం గడిపారు. ఎన్నికల సంవత్సరంలో ప్రజలను మభ్యపెట్టేందుకు.. రూ.800 కోట్ల అంచనాతో ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నట్లు హడావుడి చేశారు. అందులో భాగంగా.. టెండర్లు కూడా పూర్తయ్యాయని, త్వరలోనే ప్రాజెక్టు పనులు చేపడతామని అప్పట్లో వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. కానీ ప్రాజెక్టు నిర్మాణ పనులకు సంబంధించి కనీసం ఇటుక కూడా నేల పడలేదు. వైసీపీ ప్రభుత్వం ఈ విషయంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే చెప్పవచ్చు.

కూటమి హయాంలో మోక్షం ?

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అన్నమయ్య ప్రాజెక్టు పునర్‌నిర్మాణం గురించి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో గత నెలలో కడపలో జరిగిన మహానాడు కార్యక్రమంలో చంద్రబాబు అన్నమయ్య ప్రాజెక్టు గురించి ప్రకటన చేశారు. తమ హయాంలో అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని సభ సాక్షిగా ప్రకటించారు. దీంతో అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టుదారుల్లో ఆశలు చిగురించాయి. ఆ నేపథ్యంలో.. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య ప్రాజెక్టు పునర్‌నిర్మాణానికి సంబంధించి అధ్యయనం చేయడానికి నీటిపారుదల శాఖకు చెందిన ఉన్నత స్థాయి సాంకేతిక నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ డిజైన్ ఎక్స్‌పర్ట్ చీఫ్ ఇంజనీర్ రమేష్‌కుమార్, హైదరాబాదుకు చెందిన హైడ్రో మెకానికల్ ఎక్స్‌పర్ట్, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ, జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ ఎం.రాజు, జలవనరుల శాఖ సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ (డిజైన్ అప్రూవింగ్ అథారిటీ) విజయవాడ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ హైడ్రాలజీ చీఫ్ ఇంజనీర్లు కమిటీ సభ్యులుగా, కడప జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు) కన్వీనరుగా ఉన్నారు. సాధ్యమైనంత త్వరలో ఈ ప్రాజెక్టు పునర్ నిర్మాణంపైన కమిటీ అధ్యయనం చేసి.. నివేదికలు ఇస్తే.. రాబోయే ఆరేడు నెలల్లో .. ప్రాజెక్టు పనుల ప్రారంభంపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

కేంద్ర పథకాలపై ప్రచారం నిర్వహించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో జిల్లాలో గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరు, పెనగలూరు, కురబలకోట ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దార్తి అబాజన్ జాటియా గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపికైన 4 మండలాల్లోని 17 గ్రామాల్లో జూన్ 15 నుంచి 30 వరకు కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తదితర కార్డులు లేని లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేయాలని ఆదేశించారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో నిర్వహించబడే దార్తి అబాజన్ జాటియా గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమం పక్కాగా అమలవ్వాలని తెలిపారు. ఈ గ్రామాల్లో కొంత మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అమలవ్వని పక్షంలో వారందరికీ సహాయ సహకారాలు అందించి సంక్షేమ, అభివృద్ధి ఫలాలను వారికి అందజేయాలన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, పీఎం కిసాన్, జన్‌ధన్ బ్యాంక్ అకౌంట్, సికిల్ సెల్ డిసీజ్ కార్డు లేని లబ్ధిదారులకు ఈ నెల 30 వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించి వారికి అందజేయాలని ఎంపీడీవోలకు సూచించారు.

త్వరలో భారీగా తహసీల్దార్ల బదిలీలు

- మూడు డివిజన్లలో ఒకరు, ఇద్దరు మినహా..
- రెండు రోజులుగా అధికారుల కసరత్తు

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తహసీల్దార్ల బదిలీలు అరకొర మాత్రమే చేసి మిగిలిన వారితో సర్దుకుపోతూ వచ్చారు. అయితే ఈ సారి మాత్రం చాలా సీరియస్‌గా బదిలీల ప్రక్రియ చేపడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మూడు డివిజన్లకు గానూ ఒకరిద్దరు మినహా మిగిలిన తహసీల్దార్లందరికీ బదిలీలు ఉంటాయని విశ్వసనీయ సమాచారం. ఇందులో రెండునెలల క్రితం చార్జ్ తీసుకున్న తహసీల్దార్లను కూడా బదిలీలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా అధికారులు తహసీల్దార్ల పనితీరు, వారిపై వచ్చిన అభియోగాలను దృష్టిలో ఉంచుకొని తప్పనిసరిగా బదిలీలు చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీంతో కొందరు తహసీల్దార్లు రాజకీయ నాయకుల దగ్గర నుంచి సిఫార్సు లేఖలు తీసుకురావడం, ఫోన్లు చేయించడం లాంటివి చేస్తున్నట్లు సమాచారం. అయితే వీటిని లెక్క చేయనటువంటి జిల్లా అధికారులు ముక్కుసూటిగా వ్యవహరించి తహసీల్దార్ల పనితీరు, వారి నిబద్ధతను గుర్తించి వారికి కీలకమైన స్థానాలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు కలెక్టరేట్‌లో చర్చ నడుస్తోంది. నియోజకవర్గ హెడ్ క్వార్టర్లలో అనుభవం కలిగిన తహసీల్దార్లను నియమించే అవకాశం ఉన్నట్లు కొందరు రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు. కడప నుంచి 6 మంది డిప్యూటీ తహసీల్దార్లు, అలాగే చిత్తూరు నుంచి 9 మంది ప్రొబెషన్ పూర్తి చేసుకున్న డిప్యూటీ తహసీల్దార్లు అన్నమయ్య జిల్లాకు వస్తున్నందున అందరికీ పోస్టింగులు ఇచ్చే అవకాశం ఉంటుందని కొందరు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పై విషయాలన్నీ పూర్తిగా పరిశీలించి జిల్లా అధికారులు తహసీల్దార్లకు బదిలీలు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది.

ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం



ఉపాధ్యాయ సంఘాలతో డీఈఓలు షంషుద్దీన్, సుబ్రమణ్యం సమావేశం

కడప ఎడ్యుకేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్స్ బదిలీల కౌన్సెలింగ్ ఎట్టకేలకు మాన్యువల్ పద్ధతిలో మంగళవారం కడప నగరం శంకరాపురం స్కౌట్ హాల్‌లో ప్రారంభమైంది. ఉపాధ్యాయులు బదిలీల కౌన్సెలింగ్ వీక్షించేందుకు స్కౌట్ హాలు బయట రెండు ఎల్‌సీడీ స్క్రీన్లు ఏర్పాటుచేశారు. అయితే అమరావతి సీఎస్ఈ నుంచి లింక్ రావడం ఆలస్యం కావడంతో రాత్రి 7గంటలకు బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఎస్జీటీ తెలుగు, ఉర్దూ ఉపాధ్యాయులకు సంబంధించి 2,301 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 8సంవత్సరాలు సర్వీస్ పూర్తయి తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారు 1,410 మంది ఉన్నారు. మిగతా ఉపాధ్యాయులు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కాగా.. మాన్యువల్ బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం కావడానికి ముందు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో కడప, అన్నమయ్య జిల్లాల విద్యాశాఖ అధికారులు షంషుద్దీన్, సుబ్రమణ్యం సమావేశం అయ్యారు. బదిలీలకు సంబంధించి విధి విధానాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ, ఎస్టీయూ, యూటీఎఫ్, ఆపస్, ఎస్ఆర్టీఎఫ్, ఎస్టీఎఫ్, పీఎస్టీయూ, వైఎస్సార్‌టీఏ, ఎస్టీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

టమోటా మార్కెట్ అస్తవ్యస్తం!

- పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- రోడ్లను ఆక్రమించిన వ్యాపారులు
- బారులు తీరిన వాహనాలు
- గంటల తరబడి నిరీక్షణ



6

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష

6

సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- విద్యుత్‌శాఖ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈ

రాయచోటిటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేసుకునే వినియోగదారులు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయ ఆవరణంలో విద్యుత్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేరూరి యుగంధర్ ఆధ్వర్యంలో పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకునేందుకు రూ.78 వేల సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం ఇస్తోందన్నారు. ఈ పథకం ద్వారా కరెంటు బిల్లును ఆదా చేయడమే కాకుండా పర్యావరణానికి మేలు చేయవచ్చన్నారు. ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందని, బ్యాంకు వారు 7 శాతం వడ్డీతో 90 శాతం రుణం ఇస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యుగంధర్, డివిజన్ పరిధిలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ ఉద్యోగులు, కార్మికులు, వినియోగదారులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలకు 50,541 దరఖాస్తులు

వేంపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో చేరేందుకు 50,541 దరఖాస్తులు వచ్చాయని రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ విడుదల అయ్యాక మొదటి విడతలో 49,201 దరఖాస్తులు రాగా వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు రెండో విడతలో జూన్ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు ఇచ్చామని తెలిపారు. ఈ సమయంలో 1,340 మంది దరఖాస్తు చేసుకున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. త్వరితగతిన దరఖాస్తులను పరిశీలించి ఎంపిక జాబితా త్వరలోనే విడుదల చేస్తామని పేర్కొన్నారు.

మహిళలకు క్షమాపణ చెప్పాలి

- పెల్లుబుకిన మహిళాగ్రహం
- రాయచోటిలో ప్లకార్డులతో నిరసన
- రాజంపేటలో సాక్షి పేపర్లను దహనం చేసిన వైనం



రాజంపేటలో సాక్షి పేపర్లను దహనం చేస్తున్న మహిళలు

రాయచోటిటౌన్/రాజంపేట/మదనపల్లెటౌన్/బి.కొత్తకోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అమరావతిని వేశ్యల రాజధాని అని తీవ్ర వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావును కఠినంగా శిక్షించడంతో పాటు మహిళలకు క్షమాపణ చెప్పాలని కోరుతూ మంగళవారం పలుచోట్ల మహిళలు నిరసనలు తెలిపారు. ఇందులో భాగంగా రాయచోటి పట్టణంలోని పలువురు మహిళలు, మహిళా సంఘాలు మంగళవారం మంత్రి కార్యాలయం వద్ద తీవ్ర ఆందోళన చేశారు. సీఎం చంద్రబాబు రూ.కోట్లు వెచ్చించి దేశంలోనే అమరావతిని ఆదర్శ రాజధానిగా నిర్మిస్తుంటే జగన్ చానల్‌లో తప్పుడు కథనాలు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక రాజంపేటలో.. టీడీపీ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, ఉపాధ్యక్షురాలు శ్రీవాణిలు సాక్షి పత్రికను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా మదనపల్లె పట్టణంలో మంగళవారం స్థానిక చిత్తూరు బస్టాండు నుంచి సబ్‌కలెక్టరేట్ వరకు టీడీపీ నాయకురాళ్లు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టరేట్ డీఏఓ రాఘవేంద్రకు టీడీపీ నాయకురాళ్లు పులిమహాలక్ష్మి, బైగారి భారతినాయుడు, తలారి రాధ, శ్యామలమ్మ, రాటకొండ భారతి వినతిపత్రం అందజేశారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యల ఉదంతంపై బి.కొత్తకోటలో మహిళాగ్రహం పెల్లుబికింది. మాట్లాడిన వ్యక్తులతో పాటు చానల్‌పై చర్యలు తీసుకోవాలంటూ మహిళలు పెద్దసంఖ్యలో నిరసనకు దిగారు. నగర పంచాయతీ కార్యాలయం నుంచి బైపాస్‌రోడ్డు, రంగసముద్రం రోడ్డుల మీదుగా ప్లకార్డులు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు.

బీజేపీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న ఏకైక పార్టీ

- రాష్ట్రానికి ప్రత్యేక హోదా.. విభజన హామీల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యం
- ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

రాయచోటిటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో, రాష్ట్రంలో బీజేపీ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ఏపీకి ప్రత్యేక హోదా రావాలన్నా, విభజన హామీలు నెరవేరాలన్నా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని కేసీఆర్ కన్వెన్షన్ హాల్లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన షర్మిల మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అరచేతిలో వైకుంఠం చూపించే వ్యక్తి అన్నారు. ఎన్నికల సమయంలో ఎన్నో రకాల హామీలతో పాటు సూపర్‌సిక్స్ హామీలు ప్రకటించి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా నేటి వరకు ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడం చంద్రబాబు మోసానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ప్రజల పక్షాన పోరాడుతున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, టీడీపీ, జనసేన, వైసీపీ పార్టీలు కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీకి తొత్తులుగా మారాయని ఆరోపించారు. బీజేపీని మొదటి నుంచి వ్యతిరేకించిన వ్యక్తి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని, ఆయన కుమారుడిగా ఉండి వైఎస్ జగన్ బీజేపీతో అక్రమ సంబంధం పెట్టుకున్నారని విమర్శించారు. ఇక చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లు బీజేపీతో పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చారని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కూడా ప్రైవేటు పరం చేయడానికి కుట్రలు చేస్తుంటే రాష్ట్రంలో ఉన్న టీడీపీ, జనసేన, వైసీపీ పార్టీలు మద్దతు పలకడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటి అమలు కాలేదని విమర్శించారు. 2029 ఎన్నికల్లో రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్, మదనపల్లి ఇన్‌చార్జి పవన్‌కుమార్‌రెడ్డి, పీలేరు ఇన్‌చార్జి సోమశేఖర్‌రెడ్డి, కోడూరు ఇన్‌చార్జి గోశాల దేవి, రాజంపేట ఇన్‌చార్జి భాస్కర్, పుంగనూరు ఇన్‌చార్జి మురళీమోహన్ యాదవ్, పీసీసీ జనరల్ సెక్రటరీ అల్లాబకాష్, డీసీసీ అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్ అలీఖాన్, డీసీసీ ఉపాధ్యక్షులు చెన్నక్రిష్ణ, దర్బార్‌బాషా, డీసీసీ మహిళా అధ్యక్షురాలు రెడ్డినిగార్‌సుల్తానా, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నాయకులు, మండలాధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్థులు

- తమపై కేసు నమోదును నిరసిస్తూ .. ఎస్ఐపై దాడికి యత్నం
- పోలీస్‌స్టేషన్‌కు తాళం వేసిన సిబ్బంది



స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న గ్రామస్థులు



స్టేషన్‌కు తాళం వేస్తున్న సిబ్బంది

రామసముద్రం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రియుడితో కలిసి వెళ్లిన ఓ వివాహిత కేసుకు సంబంధించి తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎర్రబోయనపల్లె గ్రామస్థులు మంగళవారం రామసముద్రం పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. స్టేషన్‌లో ఉన్న ఎస్ఐను బయటకు లాగేందుకు యత్నించడంతో సిబ్బంది స్టేషన్‌కు తాళాలు వేసిన సంఘటన చోటుచేసుకుంది. దీంతో మండల కేంద్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకెళ్తే.. మండలంలోని ఎర్రబోయనపల్లెకు చెందిన ఓ వివాహిత శ్రీరాములపల్లెకు చెందిన ఓ వ్యక్తితో గత పదిరోజుల క్రితం వెళ్లిపోయింది. ఈ విషయమై రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఇరువర్గాలకు చెందిన కొందరు గ్రామ పెద్దల సమక్షంలో గత శనివారం రాత్రి ఎస్ఐ రాజీ చేసి పంపించారు. అయితే అదేరోజు రాత్రి శ్రీరాములపల్లెలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఎస్ఐ ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. అయితే దాడికి గురైన తమపై కూడా కేసులు నమోదు చేయడంతో ఎర్రబోయనపల్లెకు చెంది గాయపడిన వారి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మంగళవారం రామసముద్రం పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. స్టేషన్ ముందు కూర్చొని ధర్నా చేపట్టారు. అప్పటికే స్టేషన్‌లో ఉన్న సీఐ సత్యనారాయణ గ్రామస్థులతో మాట్లాడుతూ దాడిలో ఇరువర్గాల వారికి రక్తగాయాలు కావడంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని, అయితే ఎవరినీ అరెస్టు చేయలేదని, పూర్తి విచారణ చేసిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని సర్దిచెప్పారు. దీనికి అంగీకరించని గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఒకదశలో పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఎస్ఐ రవికుమార్‌ను బయటకు లాగేందుకు సీఐను తోసుకుంటూ స్టేషన్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. వెంటనే సిబ్బంది అప్రమత్తమై ఎస్ఐను లోపల ఉంచి స్టేషన్‌కు తాళాలు వేశారు. అప్పటికే మండల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా విషయం తెలుసుకుని హుటాహుటిన పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. దాడిలో గాయపడిన వారిపై కేసులు ఎందుకు పెట్టారని సీఐ, ఎస్ఐను నిలదీశారు. వీరిపై ఉన్న ఎఫ్ఐఆర్ వెంటనే తొలగించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామస్థులతో మాట్లాడుతూ ఎర్రబోయనపల్లె బాధితులపై కేసులు లేకుండా చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. ఈ విషయంపై సీఐ సత్యనారాయణను వివరణ కోరగా.. ఓ కేసు విషయమై ఎస్ఐ రవికుమార్‌ను బయటకు లాగేందుకు గ్రామస్థులు స్టేషన్‌లోకి వెళ్లేందుకు యత్నించారు. అప్పటికే ఎస్ఐ స్టేషన్‌లో ఉన్నారు. గ్రామస్థులు లోపలికి వెళ్లకుండా ముందస్తుగా స్టేషన్‌కు తాళం వేశామని తెలిపారు.



టమోటా మార్కెట్ నిర్వహణపై అధికారుల నిర్లిప్తతతో అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయి. రైతుల వాహనాలు మార్కెట్‌లోకి రావడం నుంచి.. వ్యాపారుల లారీలు బయటకు వెళ్లడం వరకూ అన్నీ సమస్యలే. ఈ అంశాలన్నీ చివరకు రైతులు, వ్యాపారులతోపాటు ధరలపైకూడా ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా ఈ మార్కెట్‌కు రోజూ వచ్చే సరుకు, కొనుగోలుదారులు, ధరల వివరాలను ఇతర మార్కెట్‌లతో పోల్చి చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ ఓ పద్ధతి, నియమం, పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణం. మార్కెట్‌కు వచ్చే సరుకుకు అనుగుణంగా విశాలమైన స్థలం లేకపోవడం.. ఉన్నా సరైన పద్ధతిలో వినియోగించుకోక పోవడంతో ట్రాఫిక్ సమస్యలు కూడా ఇబ్బందికరంగా మారుతున్నాయి.

టమోటా మార్కెట్ అస్తవ్యస్తం!

- పెరుగుతున్న సాగు విస్తీర్ణం.. ● మార్కెట్‌ను ముంచెత్తుతున్న దిగుబడులు
- రోడ్లను ఆక్రమించిన వ్యాపారులు
- బారులు తీరిన వాహనాలు ● గంటల తరబడి నిరీక్షణ
- బయటి మార్కెట్లకు కొనుగోలుదారులు ● ధరలపై ట్రాఫిక్ ప్రభావం

మదనపల్లె, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోటా మార్కెట్‌కు ఆసియాలోనే పెద్దమార్కెట్‌గా పేరుంది. అయితే ఆ స్థాయిలో ఇక్కడ సౌకర్యాలు, వసతులు లేవు. 1985లో అప్పటి సాగు విస్తీర్ణాన్ని బట్టి స్థానిక నీరుగట్టువారిపల్లె సమీపంలో 20 ఎకరాల్లో టమోటా మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో కొందరు రైతులు మాత్రమే టమోటా సాగు చేస్తుండగా, ప్రస్తుతం వ్యాపారులు, ఉద్యోగులు, అన్ని వర్గాలవారు టమోటా సాగు చేస్తున్నారు. దీంతో ఏటికేడు పంట సాగు విస్తీర్ణంతోపాటు దిగుబడి కూడా గణనీయంగా పెరుగుతోంది. అదే ఇప్పుడు అన్ని సమస్యలకు కారణమవుతోంది. ఒకప్పుడు సీజన్‌లో మాత్రమే సాగయ్యే టమోటా.. ప్రస్తుతం సీజన్‌తో పనిలేకుండా ఏడాది పొడవునా ఉంటోంది. ప్రధానంగా ఫిబ్రవరిలో పంటసాగు మొదలై.. నవంబరు వర్షాలతో పూర్తవుతుంది. ఈ మధ్య కాలంలో ధరలు రైతుల దశ, దిశను మార్చేస్తుంటాయి. వస్తే లాభం, లేకుంటే నష్టం, మధ్యతరహాగా తీసుకుంటే పెట్టుబడి వస్తుంటుంది. దీంతో ఒక పంటలో నష్టం వచ్చినా, మరో పంట ఆదుకుంటుందనే నమ్మకంతో ప్రతిరైతు దాదాపుగా మూడు అదునుల్లోనూ కొంత విస్తీర్ణంలో సాగు టమాటా చేస్తుంటాడు.

వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య

జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలతోపాటు సమీపంలోని కర్ణాటక ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా ఈఏడాది విస్తారంగా టమోటా సాగైంది. మే నెల రెండోవారం నుంచే మొదలైన దిగుబడి.. క్రమంగా పెరుగుతోంది. 500 మెట్రిక్ టన్నుల నుంచి మొదలైన టమోటా దిగుబడి.. ప్రస్తుతం రెండువేల టన్నులను దాటేసింది. ధరలు కూడా ఇదే స్థాయిలో హెచ్చుతగ్గులతో కదులుతున్నాయి. మదనపల్లె మార్కెట్‌లో ఆదివారం గరిష్టంగా 28 కేజీల క్రేట్ రూ.500 నుంచి రూ.550 వరకు పలికింది. ఇక రెండో రకం రూ.350-400, మూడో రకం రూ.300-రూ.250 పలికింది. దిగుబడులు, ధరల విషయాన్ని పక్కన పెడితే, అటు రైతులు, ఇటు వ్యాపారులను ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతున్నాయి.

తాజా సాగు విస్తీర్ణం, దిగుబడులను పరిగణలోకి తీసుకుంటే.. ఇప్పుడు మార్కెట్‌కు మరింత విశాలమైన స్థలం కావాల్సి ఉంది. ఇప్పుడున్న 20 ఎకరాల్లో అయిదు ఎకరాలు ఇతర విభాగాలకు పోగా, మిగిలిన 15 ఎకరాల్లో 50 వరకూ కమీషన్, ట్రేడ్ లైసెన్సు మండీలు నడుస్తున్నాయి. ఉన్న మండీ యజమానులు స్థలాలతోపాటు రోడ్లను కూడా ఆక్రమించేశారు. కొంత రోడ్డు ఉన్నా.. అక్కడికి వచ్చే ట్రాక్టర్లు, లారీలను లోడింగ్ పేరుతో గంటల తరబడి నిలిపేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో రైతుకు చెందిన ట్రాక్టరు లోపలికి వెళ్లాలన్నా, వ్యాపారికి చెందిన లారీ బయటకు రావాలన్నా కనీసం పది గంటల సమయం పడుతోంది. దీంతో కొనుగోలు చేసిన సరుకును సమయానికి బయటి మార్కెట్‌కు చేర్చలేక వ్యాపారులు, సరుకును మార్కెట్‌కు తెచ్చే రైతు మండీకి వెళ్లడానికి నిరీక్షించలేక సహనం కోల్పోతున్నారు. దీంతో కొందరు రైతులు, వ్యాపారులు బయటి మార్కెట్లకు తరలిపోతున్నారు. ఈ పరిస్థితి ధరలపై ప్రభావం చూపుతోంది.



మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

బారులుతీరుతున్న వాహనాలు

బయటి ప్రాంతాల నుంచి వచ్చే రైతుల ట్రాక్టర్లు నీరుగట్టువారిపల్లెలోని మార్కెట్‌యార్డు ఎదుట బారులు తీరుతున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు క్యూలో వచ్చి నిలబడితే, లోపలకు వెళ్లడానికి సాయంత్రం ఆరు అవుతోంది. అక్కడ మండీలో కాయలను అన్‌లోడ్ చేసి, తిరిగి బయటకు రావడానికి రాత్రి పది గంటలు అవుతోంది. ఇలా రోడ్డుపై నిరీక్షిస్తున్న ట్రాక్టర్లు, మినీ వ్యాన్‌లు మార్కెట్ నుంచి అమ్మచెరువుమిట్ట, అటు గొల్లపల్లె బైపాస్‌రోడ్డు వరకూ బారులు తీరుతున్నాయి. అలాగే మండీలలో కొనుగోలు చేసిన టమోటాలను బాక్సులు మార్చి లోడ్ చేసి బయటకు తరలించడానికి ఆరేడు గంటలు పడుతోంది. దీంతో వ్యాపారుల లారీలు బయటకు వెళ్లే వరకూ అప్పటికే మార్కెట్‌కు కాయలు తెచ్చిన వాహనాలు రోడ్డుపై నిరీక్షించాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని ఎవరూ అదుపు చేయలేకపోతున్నారు. చివరకు మార్కెట్ మార్కెట్ అధికారులు కూడా చేతులెత్తేస్తున్నారు. అలాగే చౌకదుకాణాలకు బియ్యం, ఇతర నిత్యావసరాలు సరఫరా చేసే గోదాము కూడా ఇక్కడే ఉండటంతో లారీలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ నిత్యావసర వస్తువులు సకాలంలో రేషన్‌షాపులకు సరఫరా చేయలేక పోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కొన్నేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. ఇదిలా ఉండగా, కొన్ని మండీల యజమానులు స్థానిక టిప్పుసుల్తాన్ మైదానంలో తాత్కాలికంగా మండీలు నిర్వహిస్తున్నారు. కొందరు రైతులు సైతం సమీపంలోని ఇతర మార్కెట్ల కాయలను తీసుకెళ్తుండగా, వ్యాపారులు కూడా అక్కడికే వెళ్తున్నారు. ఈ పరిస్థితి ప్రధాన మార్కెట్‌లో ధరలపై ప్రభావం చూపుతోంది. ఇక మార్కెట్‌లో శానిటేషన్ పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఈ అంశాలపై అధికారులు దృష్టి సారిస్తే తప్ప.. పరిస్థితి మెరుగుపడదని అటు రైతులు, ఇటు వ్యాపారులు వాపోతున్నారు.



నీరుగట్టువారిపల్లెలో రోడ్డుపై బారులు తీరిన వాహనాలు



ట్రాఫిక్ సమస్యతో మార్కెట్‌లో నిలిచిపోయిన వాహనాలు

ప్రజా దర్బార్‌తో సమస్యలకు తక్షణ పరిష్కారం

రాయచోటిటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో రాయచోటి నియోజకవర్గంలోని ప్రజలు సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి నియోజకవర్గంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రి స్వీకరించి వాటిని అక్కడికక్కడే పరిష్కరించామన్నారు.



సమస్యలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

ఎన్‌బీకే ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం

మదనపల్లె టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ జన్మదినం సందర్భంగా మదనపల్లె టీడీపీ నేత లోకేశ్ కొణెదల హైదరాబాద్‌లో మంగళవారం బాలకృష్ణను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్‌బీకే ట్రస్టుకు రూ.5,55,555 విరాళం అందజేశారు. మదనపల్లెలో టీడీపీ బలోపేతానికి మరింత కృషి చేయాలని సూచించినట్లు లోకేశ్ మీడియాతో తెలిపారు.



సినీహీరో బాలకృష్ణకు చెక్కు అందజేస్తున్న లోకేశ్ కొణెదల

అండర్‌పాస్ ఏర్పాటుతో.. దారి సమస్య పరిష్కారం

వాల్మీకిపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పనుల కారణంగా పట్టణ సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో పొలాలకు వెళ్లేందుకు దారి సమస్య ఏర్పడిందని ఏడాది క్రితం రైతులు రహదారి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎన్‌హెచ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా అండర్ పాస్ ఏర్పాటు చేశారు. దాదాపుగా 400 ఎకరాలకు పైగా సాగు భూములు ఉన్న ప్రాంతంలో జాతీయ రహదారి పనులు చేపట్టడంతో తమ పొలాలకు దారి లేకుండా పోతుందేమోమని ఆందోళన చెందామని, ఒకవేళ జాతీయ రహదారి పూర్తి చేసి ఉంటే తమ భూములకు దారి మాట ఎలా ఉన్నా సుమారు 4 నుంచి 5 కిలోమీటర్లు ప్రదక్షిణ చేయాల్సి వచ్చేదన్నారు. భోగం పల్లె రిజర్వాయర్ కుడికాలువ పనులతో పాటు తమ పొలాలకు అను గుణంగా అండర్ పాస్ నిర్మాణం పూర్తి చేయడంపై రైతులు ఎన్‌హెచ్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



భోగంపల్లె రిజర్వాయర్ సమీపంలో ఏర్పాటు చేసిన అండర్‌పాస్

నరసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు

గుర్రంకొండ, జూన్ 10 (ఆంధ్ర జ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వారి హుండీని మంగళవారం టీటీడీ అధికారులు లెక్కించారు. ప్రతి మూడు నెలలకోసారి స్వామి వారి హుండీని లెక్కిస్తారు. స్వామి వారికి హుండీ ద్వారా రూ.14,84,740 ఆదాయం వచ్చినట్లు ఆలయాధికారి కృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



హుండీని లెక్కిస్తున్న అధికారులు

మదనపల్లె సబ్‌జైలు సూపరింటెండెంట్ బదిలీ

మదనపల్లె టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె స్పెషల్ సబ్‌జైలు సూపరింటెండెంట్ రామకృష్ణ బదిలీ అయ్యారు. ఐదేళ్లకు పైగా ఇక్కడ విధులు నిర్వహించిన ఆయనను తిరుపతి సబ్ జైలు సూపరింటెండెంట్‌గా నియమిస్తూ జైళ్లశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం జైలు సిబ్బంది ఆయనకు వీడ్కోలు పలికారు. మదనపల్లె సబ్ జైలు సూపరింటెండెంట్‌గా రాజమండ్రి సబ్‌జైలులో పని చేస్తున్న కె.లక్ష్మణరావు నియమితులయ్యారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష

రాయచోటిటౌన్, జూన్10(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పరిధిలోని మదనపల్లె, రాజంపేట, రాయచోటి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆరు పరీక్ష కేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలు అత్యంత పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులు మదనపల్లెలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాల, మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలతోపాటు రాజంపేటలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల, అస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలను పర్యవేక్షించారు మంగళవారం 6 పరీక్ష కేంద్రాల్లో 1558 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1446 మంది హాజరు కాగా 112 గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలియజేశారు.

బాలిక మృతిపై విచారణ చేయాలి

మదనపల్లె టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంజునాథ కాలనీలో బాలిక మృతిపై పోలీసులు సమగ్ర విచారణ చేయించాలని ఐద్వా కన్వీనర్ భాగ్యమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద మస్తాని తల్లిదండ్రులు గఫూర్, హసీనాలను ఐద్వా నాయకురాళ్లు పరామర్శించారు. మస్తాని ఎలా మృతి చెందింది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. భాగ్యమ్మ మాట్లాడుతూ మస్తాని మృతి వివరాలు తెలిపేందుకు ఆమె తల్లిదండ్రులు భయపడుతున్నారని, పోలీసులు నిష్పక్ష పాతంగా దర్యాప్తు చేసి న్యాయం చేయాలని వారు కోరారు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి

● స్కౌట్స్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి

రాజంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించుకోవాలని స్కౌట్, గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎం.నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాజంపేట బాలికోన్నత పాఠశాలలో గైడ్స్ విద్యార్థులకు గత 5 రోజులుగా నిర్వహిస్తున్న తృతీయ సోపాన్, రాజ్య పురస్కార్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నిజాయితీ, సేవా గుణం, ధైర్య సాహసాలు పెంపొందుతాయన్నారు. స్కౌటిజం ద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. స్కౌట్ శిక్షణ పొంది సర్టిఫికెట్లు ఉన్న విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ ఉంటుందన్నారు. కావున, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అసిస్టెంట్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తృతీయ సోపాన్ శిక్షణకు 92 మంది, రాజ్య పురస్కార్ శిక్షణకు 12 మంది గైడ్స్ విద్యార్థులు హాజరయ్యారన్నారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఏవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలి, నైతిక విలువలు, దేశభక్తి, సేవాభావం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు జయలక్ష్మి, గైడ్స్ లీడర్, ట్రైనర్ శకుంతల, హెచ్‌డబ్ల్యూ బి.నిర్మల, అడ్వాన్స్ గైడ్ కెప్టెన్లు శివలీల, కనకదుర్గ, సుజాత, బేసిక్ గైడ్స్ కెప్టెన్‌లు గోవిందమ్మ, శ్యామల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి

సీసీ వైఖరికి నిరసనగా డ్వాక్రా సభ్యుల ఆందోళన

సిద్దవటం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా డ్వాక్రా సీసీ ప్రవర్తించడం తగదని డ్వాక్రా మహిళలు అన్నారు. సిద్దవటం మండలం మాధవరం-1లో మంగవారం వారు మాట్లాడుతూ సిద్దవటం మండలం మాధవరం-1 పరిధిలోని యానిమేటర్‌గా పనిచేస్తున్న సులోచన కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడేవారన్నారు. అప్పట్లో సంబంధించిన అధికారులు ఆదేశించిన పనులను నిర్వర్తించడంలో ఆమె విఫలమయ్యారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని సంబంధిత సీసీ ఆమెను తప్పించాలన్న ఉద్దేశంతో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆమె కోలుకుని విధులను నిర్వర్తించడానికి సిద్ధంగా ఉన్నా సీసీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించారన్నారు. గతంలో ఆమె విధులు సక్రమంగా నిర్వహిస్తూ లక్ష్యాలను సాధించారన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు విచారించి ఆమెకు తగు న్యాయం చేయాలని, ఆమెను విధుల్లో కొనసాగించాలని డ్వాక్రా సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఏపీఎం సుజాతను వివరణ కోరగా జరిగిన విషయం పరిశీలించి తగు న్యాయం చేస్తామని ఆమె సూచించారు.



ఆందోళన చేస్తున్న మహిళలు

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

మదనపల్లె టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సీటీఎం రోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నిబంధనలు విరుద్ధంగా కడుతున్న కమర్షియల్ భవనాలపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఫిర్యాదు చేశారు. మంగళవారం సబ్ కలెక్టరేట్ డీఏఓ రాఘవేంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్టేట్‌లో కార్మికులకు ఉపాధి కల్పించే పరిశ్రమలను నెలకొల్పాలే కానీ, పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని తక్కువ ధరలకు స్థలాలు తీసుకుని, వాటిలో కమర్షియల్ భవనాలు నిర్మిస్తూ కార్మికుల పొట్టకొడుతున్నారన్నారు. దీనిపై ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా ఆయన పట్టించుకోలేదన్నారు. ఈ విషయమై విచారణ చేసి తగుచర్యలు తీసుకోవాలని పునీత్ కోరారు. హరికృష్ణ, జిలాని, నవీన్, శశికుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టరేట్ డీఏఓకు వినతి పత్రం సమర్పిస్తున్న బీవైఎస్ నేతలు

కిశోర వికాసంపై యువతులకు అవగాహన

బి.కొత్తకోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కిశోర వికాసం కార్యక్రమం ద్వారా కిశోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించామని బి.కొత్తకోట ప్రాజెక్టు సీడీపీఓ భాగ్యమ్మ తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని తాకాటంవారిపల్లి సచివాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, సైబర్‌నేరాలు, మహిళా రక్షణ కోసం ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలు, బాల్యవివాహాలతో అనర్థాలు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలను శిక్షణా తరగతుల్లో వివరించామని, గ్రామాల్లో ఆయా అంగన్వాడీ కేంద్ర కార్యకర్తల ద్వారా విపులంగా తెలియపరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హిజాద్‌ప్యారీ, జీఎంఎస్కే సుమతి, వెల్ఫేర్ ఉద్యోగి మౌలా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ భాగ్యమ్మ

తంబళ్లపల్లె: బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిషోర వికాసం ఎంతగానో దోహదపడుతుందని మహిళా సంరక్షణ కార్యదర్శి భారతి అన్నారు. మంగళవారం మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో కిషోర వికాసంపై అవగాహన కల్పించారు. రక్తహీనత, ఐరన్ లోపం వలన కలిగే నష్టాలు, రక్తహీనత నివారణ, ఆరోగ్యం, పోషణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తపోర్దు సంస్థ సిబ్బంది బాల్య వివాహాలతో నష్టాలు, బాలికల విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో అంగన్వాడీ కార్యకర్తలు ఉమ, కళావతి, సరస్వతి, మహిళా పోలీసులు, మహిళలు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

కలకడ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నాటు సారా విక్రయిస్తున్న రాజానాయక్ అనే వ్యక్తి ని మంగళవారం అరెస్టు చేసినట్లు రాయ చోటి ఈఎస్‌టీఎఫ్ సీఐ ఎల్లయ్య తెలిపారు. కలకడ మండలం బాలయ్యగారిపల్లెలో అత ని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసున్నట్లు వివరించారు. అతనికి నాటు సారా సరఫరా చేసిన సంబేపల్లె మండలం శెట్టిపల్లె పెద్దబిడికికి చెందిన ఆదిరెడ్డినాయక్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా సారా అమ్మినా, రవాణా చేసినా, దాచిఉంచినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది మోహన్‌రెడ్డి, హుస్సేన్, బాలకృష్ణ, జానీ పాల్గొన్నారు.



నిందితుడిని చూపుతున్న పోలీసులు

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

కురబలకోట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పీటీఎం మండలం ఉప్పరోళ్లపల్లెకు చెందిన లక్ష్మిదేవి (46)భర్తతో విడిపోయి, కూలి పనులు చేసుకుంటూ మదనపల్లె పట్టణం చంద్రా కాలనీలో ఒంటరిగా జీవిస్తోంది. పక్క కాలనీకి ఒక వ్యక్తితో సన్నిహితంగా ఉండేది. ఈమెకు పిల్లలు లేరు. కాగా, మంగళవారం ఉదయం మండలంలోని సర్కారు తోపు సమీపంలో జాతీయ రహదారి పక్కన చెట్టుకు ఉరేసుకున్న స్థితిలో ఆమె మృతదేహం కనిపించింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ వివాదంలో దంపతులపై దాడి

కురబలకోట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): భూ వివాదం కారణంగా ప్రత్యర్థులు దంపతులపై దాడి చేసి గాయపరిచారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ బండపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి, వెంకటరమణారెడ్డి సోదరులు. వీరికి గ్రామంలో కొంత భూమి ఉంది. అయితే ఈ భూమి విషయమై పలుమార్లు గొడపడ్డారు. ఈ భూమి సర్వే చేసేందుకు శ్రీనివాసులు రెడ్డి చలానా కట్టాడు. అయితే అధికారులు సర్వే చేసేందుకు రాగా ఇరువురి మధ్య వాగ్వా దం జరిగింది. దీంతో ఆగ్రహించిన వెంకట రమణారెడ్డి భార్య లక్ష్మీదేవి, కుమారులు చంద్రశేఖర్‌రెడ్డి, శివకృష్ణారెడ్డిలు శ్రీనివాసు లురెడ్డి అతని భార్య అమరావతిపై దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో అమరా వతి చేయి విరిగింది. బాధితురాలిని కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలకు రూ. 56 వేలు జరిమానా

పీలేరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలపై ఆకస్మిక దాడులు నిర్వహించి రూ. 56,510 జరిమానా వసూలు చేసినట్లు పీలేరు ఎంవీఐ విజయకుమారి తెలిపారు. మంగళవారం పీలేరు- సుండుపల్లె రోడ్డులోని కేవీపల్లె మండలం గర్నిమిట్ట వద్ద ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా, కెపాసిటీకి మించి ప్రయాణికులను తరలిస్తున్న తొమ్మిది ఆటోలను నిలిపి రూ. 56,510 జరిమానా విధించారు. ఇకపై అక్రమంగా ప్రయాణికులను తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పీలేరు ఆర్టీసీ డీఎం పీ. నిర్మల, ఆర్టీసీ డిపో మేనేజర్ బాబునాయక్ పాల్గొన్నారు.

'పని గంటల పెంపు దుర్మార్గం'

మదనపల్లె, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం చేసిన కార్మిక వ్యతిరేక నిర్ణయాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో మంగళవారం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎనిమిది గంటల పని విధానం కొనసాగించాలన్నారు. రాష్ట్రంలో కార్మిక చట్టాలను మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. 50 లక్షల మంది కార్మికులకు 13 సంవత్సరాలుగా కనీస వేతనాల సవరణ జరగలేదన్నారు. 20 లక్షల మందికిపైగా పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కూటమి ప్రభుత్వం పునరుద్ధరించలేదన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్ప, చంద్రశేఖర్, ఏఐటీయూసీ నాయకులు మస్తాన్, ముబారక్, తిరుమల, దేవా, చలపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి ఆత్మహత్యాయత్నం

● ఇద్దరిని కాపాడిన రైల్వే పోలీసులు

● కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబం వద్దకు చేర్చిన వైనం

ఎర్రగుంట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు చోట్ల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను రైల్వే ఆర్ఎస్ఐ రవిచంద్ర, ఆర్‌పీఎఫ్ బృందం కాపాడింది. వివరాల్లోకి వెళితే... పెనికలపాడు గ్రామానికి చెందిన పల్లేటి మునిస్వామి కుటుంబ కలహాలతో సోమవారం రాత్రి 9.50 గంటల ప్రాంతంలో కలమల్ల రైల్వే స్టేషన్ సమీపంలో ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చాడు. గమనించిన రైల్వేస్టేషన్ మాస్టర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జీఆర్‌పీ ఆర్ఎస్ఐ రవిచంద్ర, ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ శివకుమార్‌లు అక్కడికి చేరుకుని మునిస్వామికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం పెనికలపాడుకు వెళ్లి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. అలాగే ఎర్రగుంట్లలో సోమవారం రాత్రి 9గంటల సమయంలో కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకునేందుకు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌కు రాగా... గమనించిన రైల్వే పోలీసులు, ఆర్ఎస్ఐ రవిచంద్ర, సిబ్బంది అతనిని కాపాడారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి వారి భార్యా పిల్లలకు అప్పగించారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

దువ్వూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లె సమీపంలోని ఫారెస్టు పరిధిలో మంగళవారం నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు అక్రమంగా దుంగలు తరలిస్తున్న దాసరిపల్లెకు చెందిన బసప్ప, సుబ్రమణ్యం, బాస్కరయ్య అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వీరు నెల కిందట 12 దుంగలు కొట్టి వాటిలో ఎనిమిది దుంగలను తరలించారని, మిగతా నాలుగు దుంగలను తరలిస్తుండగా ఫారెస్టు బీట్ ఆఫీసర్ సుచరిత, కానిస్టేబుల్ ఓబులేసుతో కలిసి నిందితులను అరెస్టు చేసి దుంగలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు వివరించారు.

యువకుడు ఆత్మహత్య


ప్రశాంత్ (ఫైల్)

వీరపునాయునిపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లెలోని ఎస్సీకాలనీకి చెందిన లింగదారి ప్రశాంత్ (23) అనే యువకుడు ఆత్మ హత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. ప్రశాంత్ తన తల్లి చనిపోవడంతో తరుచూ మనస్థాపానికి గురయ్యేవాడు. నాలుగు రోజుల క్రితం తండ్రితో తనకు పెళ్లి చేయమని వాదనకు దిగేవాడని, పెళ్లిచేయలేదని బాధతో మద్యం మత్తులో ఇంట్లోనే ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కూల్‌డ్రింక్ షాపులో చోరీ

బద్వేలుటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని కూల్‌డ్రింక్ షాపులో మంగళవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. కూల్‌డ్రింక్ షాపునకు తాళాలు వేసినవి వేసినట్లే ఉన్నా, దొంగలు ఎంతో చాకచక్యంగా షాపు పైకప్పు బాగంలో రేకులను కట్టర్ సాయంతో కట్‌చేసి లోపలికి ప్రవేశించారు. షాపులో ఉన్న రూ.10వేల నగదు, రూ.30వేలు విలువ చేసే సిగరేట్లు తదితర సామాగ్రిని దోచు కెళ్లారు. దుకాణ దారుడు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆరు నెలల క్రితం ఇదే తరహాలో పక్క షాపులో చోరీ జరగడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు దొంగతనాలపై నిఘా పెట్టాలని కోరుతున్నారు.

గొడ్డలితో దాడి...కేసు నమోదు

ముద్దనూరు జూన్ 10 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి దేనేపల్లెలో మంగళవారం ఉదయం బోల రామ్మోహన్‌పై గొడ్డలితో దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. శనివారం బోల రామ్మోహన్ ఇంటిలో ఫంక్షన్ జరిగింది. అదే గ్రామానికి చెందిన ఉత్తయ్య ఫంక్షన్‌లో తన మనుషులను పనికి పిలవకుండా వేరే వ్యక్తులను పెట్టుకున్నాడని రామ్మోహన్‌ను కొడతామని హెచ్చరించాడు. ఉదయం రామ్మోహన్ పొలంలో ఉండగా ఉత్తయ్య తన మనుషులతో కలిసి ఉద్ధేశ్యపూర్వకంగా గొడ్డలితో దాడి చేయడంతో రామ్మోహన్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఉత్తయ్య, శివ, శివశంకర్, లక్షుమయ్య, నరసింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లైంగిక వేధింపులు...కేసు నమోదు

మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన బోల రామ్మోహన్ అనే వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. రామ్మోహన్ పొలం పనిచేసేందుకు వెళ్లిన మహిళను లైంగికంగా వేధించడంతో తప్పించుకొని ఇంటికి వెళ్లింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రామ్మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

కడప క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం కోఆపరేటివ్‌కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న భవనం రెండో అంతస్థు నుంచి పడి వెంపటి శ్రీనివాసరావు(40) మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. గుంటూరుకు చెందిన శ్రీనివాసరావు బేల్దారి పని నిమిత్తం కడపకు వచ్చారు. ఆయన పని చేస్తున్న సమయంలో పైనుంచి పడి మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి అన్న సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నలుగురు తహశీల్దార్లు బదిలీ

కడప కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాలో నలుగురు తహశీల్దార్లను బదిలీచేస్తూ కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బ్రహ్మంగారిమఠంలో పనిచేస్తున్న తహశీల్దారు డి.దామోదరరెడ్డిని ఒంటిమిట్టకు, ఒంటిమిట్టలో పనిచేస్తున్న రమణమ్మను ఖాజీపేటకు బదిలీ చేశారు. ఖాజీపేటలో పని చేస్తున్న తహశీల్దారు డి. మహబూబ్‌బాషాను జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో కేఆర్‌సీసీ తహశీల్దారుగా, గోపవరం మండల తహశీల్దారుగా పని చేస్తూ కలెక్టరేట్‌లో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఆర్.జీవన్ చంద్రశేఖర్‌ను ముద్దనూరు తహశీల్దారుగా బదిలీ చేసి, అక్కడ నుంచి డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌లోని డి-సెక్షన్ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా జిల్లాలో భారీగా తహశీల్దార్ల బదిలీలు ఉంటాయని భావించారు. అధికార పార్టీ నేతలు కొందరికి రెకమెండేషన్ లెటర్స్ ఇప్పించినప్పటికీ కలెక్టర్ తనదైన శైలిలో తహశీల్దార్ల బదిలీలు చేయడం గమనార్హం. ఇకపోతే అన్నమయ్య జిల్లా నుంచి ముగ్గురు డిప్యూటీ తహశీల్దార్లు బదిలీపై జిల్లాకు రానున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 8 మంది డీటీలకు త్వరలో తహశీల్దార్లుగా పదోన్నతులు లభించే అవకాశాలున్నట్లు సమాచారం.

మహిళపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు


శిక్ష పడిన ముద్దాయిని చూపుతున్న పోలీసులు

చెన్నూరు జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారానికి పాల్పడ్డ కేసులో బరకం వెంకటేశ్ అనే వ్యక్తికి కడప 7వ ఏడీజే కోర్టు న్యాయ మూర్తి ఎ.రమేశ్‌కుమార్ జీవితఖైదుతో పాటు రూ.లక్షా 50 వేలు జరిమానా విధించారు. పోలీసుల కథనం మేరకు..

చెన్నూరు మండలంలోని ఓ గ్రామ సచివాలయం పరిధిలో వలంటీరుగా పనిచేస్తున్న మహిళకు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన బరకం వెంకటేశ్ పరిచయం అయ్యాడు. ఇద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునే వారు. వెంకటేశ్ ఆ మహిళపై ప్రేమ ఉన్నట్లు నటించి పెళ్లి చేసుకుందామని నమ్మించి కడప నగరంలోని ఓ లాడ్జికి పిలిపించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆ తరువాత మహిళ పెళ్లి ప్రస్తావన తీసుకురావడంతో నిరాకరించడంతో పాటు దుర్భాషలాడాడు. దీనిపై 2021 జూన్ 20న బాధితురాలి ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేశారు. అనంతరం విచారణను అప్పటి కడప రూరల్ సీఐ మహ్మద్ ఆలీకి అప్పగించారు. సీఐ దర్యాప్తు చేసి వెంకటేశ్‌ను అరెస్టు చేసి కడప 7వ ఏడీజే కోర్టు జడ్జి ఎదుట విచారణకు హాజరుపరిచారు. ప్రస్తుత సీఐ క్రిష్ణారెడ్డి సంబంధిత సాక్షులను సకాలంలో హాజరు పరిచారు. బాధితురాలి తరపున ఎం.యాస్మిన్ వాదనలు వినిపించారు. ఈ మేరకు వెంకటేశ్ నేరం చేసినట్టుగా రుజువు కావడంతో అతడికి జీవిత ఖైదుతో పాటు రూ.1.50 లక్షలు జరిమానా విధిస్తూ మంగళవారం జడ్జి తీర్పు ఇచ్చారు.

రైతులకు నష్టం జరుగకుండా చూడాలి : ఆర్డీవో


హైపవర్ విద్యుత్తు లైను వెళ్లే పొలాలను పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దారు తదితరులు

సీకేదిన్నె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా హైపవర్ విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయాలని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. మంగళవారం చింతకొమ్మదిన్నె గంగమ్మ ఆలయం సమీపంలో హైపవర్ విద్యుత్తు లైన్లు వెళ్లే పొలాలను సీకే దిన్నె తహసీల్దారు నాగేశ్వరరావు, రైతులు, పవర్‌గ్రిడ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైవేకు సమాంతరంగా విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని, అదే సమయంలో రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. రైతులకు అన్యాయం జరుగకుండా రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని చింతకొమ్మదిన్నె చెరువు నుంచి గుట్టపై నుంచి డిజైన్ మార్చుకోవాలన్నారు. అలా కాకుండా రైతుల విలువైన భూములు కోల్పోయే విధంగా చేయరాదన్నారు. అంతకుమునుపు చింతకొమ్మదిన్నె, కొలుములపల్లె, జమాల్‌పల్లి, ఇప్పెంట, తదితర గ్రామాల రైతులు పవర్‌గ్రిడ్ స్టేషన్‌కు వెళ్లి నిరసన తెలిపేందుకు వెళ్లారు. అయితే ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న 765 కేవీ విద్యుత్తు లైను డిజైన్లు పవర్‌గ్రిడ్‌వారు చేయడం లేదని.. స్టెరిలైట్ కంపెనీ వారు చేస్తున్నారని తెలుసుకుని రైతులు తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో తహసీల్దారు రైతుల ఇబ్బందులను ఆర్డీవోకు వివరించడంతో ఆర్డీవో స్వయంగా వచ్చి రైతుల భూములను, విద్యుత్తు లైను వెళ్లే మార్గాన్ని పరిశీలించి వారికి డిజైన్ మార్చుకోవాలని సూచించారు. అదే విధంగా ఈ కంపెనీ వారు ఈనెల 10లోగా తమ అభ్యంతరాలు తెలియజేయాలని పత్రికా ప్రకటన ఇచ్చి ఆ అడ్రస్‌లో వారు లేకపోవడంతో అభ్యంతరాలు తెలిపేందుకు తాము ఢిల్లీకి వెళ్లి ఎన్నో వ్యయప్రయాసలకు గురైనట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జిల్లా సహకార అధికారిగా వెంకటసుబ్బయ్య



కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార అధికారిగా ఎం.వెంకటసుబ్బయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుదీర్ఘకాలంగా ఈ పోస్టును ఇన్‌చార్జి అధికారులతోనే నెట్టుకొచ్చారు. నంద్యాలలో పనిచేస్తూ కడప డీసీవోగా నియమితులైన వెంకట సుబ్బయ్య గతంలో మెప్మా పీడీగా, డీఆర్‌డీఏ పీడీ, ఎస్ఎస్ఏ పీవోగా జిల్లాలో పనిచేశారు. ఎన్టీఆర్ జిల్లా సహకార అధికారిగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరెడ్డిని ప్రొద్దుటూరు లోని సహకార శిక్షణ కేంద్రం అధ్యాపకుడుగా నియమించారు. కడప జిల్లా మైన్స్ జియాలజీ అధికారిగా డి.వెంకటసాయిని నియమించారు. గుంటూరు జిల్లాలో డీఎంజీవోగా ఆయన ఇప్పటి వరకు విధులు నిర్వహించే వారు. బాపట్ల ఏడీఎంగా పనిచేస్తున్న ఆర్.రాజేశ్‌కుమార్‌ను రాయచోటి డీఎంజీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పరారీలో ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ

పులివెందుల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి పరారీలో ఉన్నారు. పోలీసు వర్గాల కథనం మేరకు.. మహానాడు సందర్భంగా గత నెల 28వ తేదీన టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పులివెందులలోని పార్నపల్లె రింగురోడ్డు సర్కిల్ నుంచి కడప రింగురోడ్డు సర్కిల్ వరకు ఆయా సర్కిళ్లలో టీడీపీ తోరణాలు, ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేశారు. అయితే వైసీపీకి చెందిన కొంతమంది వీటిని పీకేసి, ఫ్లెక్సీలను చించేశారు. అదే సమయంలో వైసీపీకి చెందిన వారు మారణాయుధాలతో తనను చంపేందుకు వెంబడించారని టీడీపీ నేత విజయ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పట్లోనే 15 మందిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్‌తో పాటు 13 మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. మిగిలిన ఇద్దరూ ఇంకా పోలీసులకు చిక్కలేదు. వీరిలో అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి కేసు నమోదైన రోజు నుంచి పరారీలో ఉన్నట్లు సమాచారం. పరారైన మరో వ్యక్తి ఎవరనేది పోలీసులు వివరాలు వెల్లడించలేదు. వీరిద్దరినీ అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రత్యేక బృందాల ద్వారా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

కర్నూలు, కడప జట్ల విజయం


రణధీర్‌రెడ్డి, కడప(54 పరుగులు), విఖ్యాత్, నెల్లూరు (66 పరుగులు), కిన్నుకిశాల్, నెల్లూరు (50 పరుగులు)

కడప స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగు తున్న ఏసీఏ మెన్ అండర్ 19 వన్డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా మంగళవారం కడప, కర్నూలు విజయం సాధించాయి. వివరాలిలా... కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు తొలుత ఫీల్డింగు ఎంచుకుంది. దీంతో చిత్తూరు జట్టు బ్యాటింగ్ చేపట్టి 33.1 ఓవర్లలో 124 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు కేవలం 15.4 ఓవ ర్లలో 3 వికెట్లు కోల్పోయి 128 పరుగులు సాధించింది. ఇందులో రణధీర్‌రెడ్డి 54 పరుగులు, రోహిత్‌వర్మ 37 పరుగులు చేశారు.

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టు 7 వికెట్ల తేడాతో నెల్లూరు జట్టుపై విజయం సాధించింది. తొలుత టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు 48.1 ఓవర్లలో 176 పరుగులు సాధించి ఆలౌట్ అయింది. ఇందులో కిన్నుకిశాల్ 50 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 34 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయానికి అవసరమైన 180 పరుగులు సాధించింది. ఇందులో విఖ్యాత్ 66 పరుగులు చేసి జట్టు విజయానికి దోహదపడ్డాడు.

శ్మశాన స్థలం ఆక్రమణపై ధర్నా

● భూ ఆక్రమణదారుల నుంచి విడిపించాలని డిమాండ్ ● ఆర్డీవో పరిశీలన.. హద్దులు కేటాయింపు



ధర్నా నిర్వహిస్తున్న గ్రామ ప్రజలు, సీపీఎం నాయకులు, శ్మశాన స్థలాన్ని పరిశీలించి అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

బ్రహ్మంగారిమఠం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సోమిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నెం.464లో 10 ఎకరాల 5 సెంట్లు భూమిని శ్మశానవాటికకు కేటాయించారు. అయితే ఇటీవల నలుగురు వ్యక్తులు శ్మశాన స్థలాన్ని ఆక్రమించి రెవెన్యూ రికా ర్డుల్లో తమ పేర్లను ఎక్కించుకున్నారు. దాదాపు 8 ఎకరాలు ఆక్రమిం చడంతో మిగిలిని రెండు ఎకరాల్లో పది గ్రామాల ప్రజలు దహన సంస్కారాలు, అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు పడేవారు. దీనిపై గత 8 నెలలుగా గ్రామస్తులు సంబంధిత అధికా రులు, ప్రజాప్రతినిధులకు అర్జీలను సమర్పించాచారు. అయితే సరైన స్పందన లేకపోవడంతో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామ స్తులు శ్మశాన స్థలం వద్ద ధర్నా చేపట్టారు. శ్మశాన స్థలానికి పూర్తి స్థాయిలో కొలతలు నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు వెంటనే స్పందించిన ఆర్డీవో చంద్రమోహన్ అక్కడకు చేరు కొని పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం శ్మశాన స్థలానికి కొలతలు నిర్వహించి హద్దులను కేటాయించారు. రెండు మూడురోజుల్లో పూర్తిస్థాయిలో స్థలం చుట్టూ అధికారులు కంచెను ఏర్పాటు చేస్తారని తెలిపారు. కార్య క్రమంలో తహసీల్దారు రాజనరసింహ నరేంద్ర, డిప్యూటీ తహసీల్దారు జాన్సన్, వీఆర్వో సుధాకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. కాగా, అంతకు ముందు ఆక్రమణదారులు ఆర్డీవోను కలిసి తమ రికార్డులు చూపించా రు. రికార్డులను పరిశీలించిన ఆర్డీవో చంద్రమోహన్ వారితో ఎక్కడే కానీ ఈ రికార్డులకు పూర్వపు రికార్డులకు సరిపోవడం లేదని.. ఆర్ఎస్ ఆర్‌లో స్మశాన స్థలమే ఉందన్నారు. శ్మశాన స్థలాల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గండి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


నిత్యాన్నదాన పథకానికి విరాళాలు ఇస్తున్న దాతలు


చక్రాయపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో జరిగే శాశ్వత నిత్య అన్నదాన పథకానికి ప్రొద్దుటూరుకు నారాయణరెడ్డి, కళావతి దంపతులు రూ.50116, అలాగే తిరుపతి శ్రీకాళహస్తికి చెందిన కంభం సుధాకర్‌రెడ్డి, సంగీత దంపతులు రూ.50116 విరాళంగా ఇచ్చారు. దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, పూజా రులు ఆలయ మర్యాదలతో సత్కరించి ఘనంగా పూజలు చేయించారు.

వేలం ద్వారా రూ.25 వేలు ఆదాయం

కలకడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా వల్లూరు మండలంలో ఉన్న పుష్పగిరి మఠం భూములకు మంగళవారం నిర్వహించిన వేలంలో కౌలు ద్వారా రూ.25 వేలు ఆదాయం వచ్చినట్లు మఠం మేనేజర్ గిరిధర్ తెలిపారు. మఠానికి సంబంధించి కలకడ మండలంలోని నవాబ్‌పేట పంచాయతీ సర్వే నెంబరు 64లో 9.96 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. వీటి కౌలు హక్కులను వేలంలో హెచ్చుదారుగా నిలిచిన శంకర్‌నాయుడు ఏడాదికి రూ.25 వేలు చెల్లించేలా మూడేళ్లకు దక్కించుకున్నారు. మునుపు ఏడాదికి 1500 ఉన్న 23500 పెరిగి రూ.25 వేలుకు పెరిగింది. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సిద్దయ్య, దేవాదాయశాఖ అధికారి శశికుమార్, నాగభూషణ్ పాల్గొన్నారు.

యండపల్లి ఫార్మసీ అధికారి డెప్యుటేషన్ పొడిగింపు


కలికిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గతంలో కడప జిల్లాలోని యండపల్లి పీహెచ్‌సీలో ఫార్మసీ అధికారిగా పనిచేసే పి.ఉమాదేవి డెప్యుటేషన్ గడువును మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 2022లో ఆమెను యండపల్లి పీహెచ్‌సీ నుంచి డిప్యుటేషన్‌పై మంగళగిరిలోని ఏపీ వైద్య సర్వీసులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్‌లో డెప్యుటేషన్‌పై నియమించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఆమె డెప్యుటేషన్ గడువును పెంచుతూ వచ్చారు. అదే విధంగా తాజాగా మరో ఏడాది అంటే 2025-26 సంవత్సరం వరకూ నాలుగోసారి పొడిగిస్తూ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్మణి మంగళవారం డెప్యుటేషన్ పొడిగింపు ఉత్తర్వులు జారీ చేశారు.



రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● వేరుశనగ విత్తనాలు, డ్రోన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, జూన్10(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఖరీఫ్- 2025 సీజన్‌కు సంబంధించి మంగళవారం సంబేపల్లె మండలంలోని నారాయణరెడ్డిగారిపల్లె రైతు సేవా కేంద్రంలో, రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తన బస్తాల పంపిణీ చేపట్టారు. 30 కేజీల విత్తన బస్తా ధర రూ.2850 కాగా ప్రభుత్వం రూ.1140 రాయితీగా ఇవ్వడంతో రతులు కేవలం రూ.1710 చెల్లించి పొందవచ్చునన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు సులభ పద్ధతిలో తక్కువ ఖర్చుతో పంట పొలాలకు పిచికారీ చేసుకునేందుకు కిసాన్ డ్రోన్లను సబ్సిడీపై అందజేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ యంత్ర పరికరాల బ్యాంకుల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం 80 శాతం రాయితీతో కిసాన్ డ్రోన్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కిసాన్ డ్రోన్లను రైతులకు అందజేశారు. ప్రభుత్వం నుంచి మరిన్ని రాయితీ పథకాలు, ఆధునిక పరికారలు త్వరలో అందుబాటులోకి రానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు శ్రీలత, ఎంపీడీవో రామచంద్ర, వ్యవసాయ అధికారులు రమేశ్‌రాజు, కిశోర్‌నాయక్, మహబూబ్‌బాషా, గీత, విస్తరణ అధికారులు రెడ్డి వెంకట్రమణ, రేణుక, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



వేరుశనగ విత్తన కాయలను రైతులకు అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

చిన్నమండెం, జూన్10(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. చిన్నమండెం మండలంలోని వారి స్వగ్రామంలో మంగళవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. పలువురు ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అక్కడిక్కడే కొన్నింటిని పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి: ఏఐవైఎఫ్

రాయచోటి టౌన్,జూన్10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని అఖిల భారత యువజన విద్యార్థి సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ఇబ్బందిపడుతున్నారన్నారు. ఇప్పటికైనా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వేణు గోపాలుడిని దర్శించుకున్న ముక్కా

పెనగలూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పెనగలూరులో జరుగున్న వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి వేణుగోపాలస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెంచలకోన మాజీ ధర్మకర్త గణపతిరెడ్డి, రంగారెడ్డి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు ఆయన బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. ఆయనవెంట డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, ఊటుకూరు పాల్‌రెడ్డి, దుర్గయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి పి.రవికుమార్, దామోదర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు

ఆంజనేయ స్వామికి పూజలు

సుండుపల్లె, జూన్10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మసముద్రం మర్రిచెట్టు వద్ద నిర్వహిస్తున్న తిరుణాల ఉత్సవాల్లో భాగంగా ఆంజనేయ స్వామికి భక్తి శ్రద్ధలతో మంగళవారం ఆంజనేయస్వామికి ఆకుపూజలు, అభిషేక పూజలు భక్తిశ్రద్ధలతో చేయించారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఆంజనేయస్వామి, చంద్ర మౌళీశ్వరస్వామి, ఏపురమ్మలకు పూజలు, అర్చనలు చేయించుకుని తీర్థప్రసాదాలు పొందారు. మంగళవారం మధ్యాహ్నం దిన్నెపాడు బలిజపల్లెకు చెందిన ప్రకాశ్ కుటుంబ సభ్యులు ఆలయం వద్ద అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

లక్కిరెడ్డిపల్లె, జూన్10(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లెలోని సచివాలయం-1లో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఉషారాణి తెలిపారు. ఆధార్‌లో చేర్పులు, మార్పులు, చిన్న పిల్లలను నమోదు చేసుకోవడం, 10 నుంచి 13వ తేదీలోపు చేర్పులు, మార్పులు చేసుకోవచ్చన్నారు.

వైసీపీ నేతలకు చిత్తశుద్ధి లేదు: జనసేన

సిద్దవటం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అమరావతిపై వైసీపీ నేతలకు చిత్తశుద్ధి లేదని రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ తెలిపారు. మాధవరం-1 గ్రామం పార్వతీపురంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మహిళల ఆత్మ గౌరవాన్ని కించపరిచిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీకాంత్, చిన్న వెంకటయ్య,మహబూబ్‌బాషా, పసుపులేటి గంగయ్య, జగన్, రవికుమార్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను మార్చడంపై దేశవ్యాప్త సమ్మె

పుల్లంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 29 కార్మిక చట్టాలను కేవలం 4 లేబర్‌కోడ్‌లాగా మార్చి అన్యాయం చేస్తోందని, దీనిపై జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సీఐటీయూ పిలుపునిచ్చిందని జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం పుల్లంపేటలో సీఐటీయూ మండల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనాల చట్టం, పీఎఫ్, ఈఎస్‌ఐ, గ్రాట్యూటీ ఇలాంటి హక్కులు కార్మికులు కోల్పోతారన్నారు. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ఆక్ట్ ప్రకారం డ్రైవర్లు యాక్సిడెంట్ చేస్తే 10 సంవత్సరాలు జైలు శిక్ష, 10 లక్షలు నష్టపరిహారం చెల్లించే విధంగా మార్చారన్నారు. సీఐటీయూ మండల అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మండల సమన్వయ కమిటీని జిల్లా నాయకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా పి.రోజా, కోకన్వీనర్లుగా శ్రీనివాసులు, రోజా, కమిటీ సభ్యులుగా వెంకటరమణ, సునీత, స్వర్ణలక్ష్మి ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

రాజంపేట టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలోని గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఏళ్లలో రైతు సంక్షేమమే దేశ సంక్షేమమని భావించి బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అలాగే రక్షణ రంగంలో ప్రపంచం మొత్తం నిద్రపోయే విధంగా మనదేశ సంరక్షణ వ్యవస్థ పటిష్టంగా తయారు చేయడం అభినందనీయమన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత దేశం ముందుండటమే గాకుండా ప్రపంచంలోనే నాలుగోదిగా అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ముందుకెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, పట్టణ అధ్యక్షుడు వీవీ రమణ, పట్టణ కార్యదర్శి పెనుగొండ రమణ, బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.పాపయ్య, వేణు, ప్రసాద్‌రాజు, గాదెల శ్రీనివాసులు, నాగరాజు, పత్తిపాటి నవీన్‌కుమార్, రమణారెడ్డి, తోట నగేష్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

విద్యార్థినిని అభినందించిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి కలెక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా అందుకున్న రూ.20 వేల నగదును పిఠాపురంలోని అనాథ పిల్లలకు అందించిన పసుపులేటి చరతార్థినిని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అభినందించారు. మంగళవారం కోడూరు పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న వయస్సులో గొప్ప మనస్సు చాటుకోవడం అభినం దనీయమన్నారు. ఈ విషయం పవన్ కళ్యాణ్ దృష్టికి తిసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి, విక్టరి స్కూల్ కరస్పాండెంట్ నరిసంహారెడ్డి, పీసీఎన్ బ్రదర్స్, వార్డు సభ్యుడు పోతురాజు నవీన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న విద్యార్థిని

లోతు దుక్కులతో ఎంతో ప్రయోజనం

పెనగలూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): లోతు దుక్కులు ఎంతో ప్రయోజనం కలిగిస్తాయని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం, తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి.మాధురి అన్నా రు. వికసిత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా పెనగలూరులో ఏవో ఎన్‌కేవీ సుబ్రమణ్యం అధ్యక్షతన మంగళవారం కోడిచెన్నయ్యగారిపల్లె, నారాయణనెల్లూరు గ్రామాల్లో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. వరి, నువ్వు పంటలు సాగు చేసే రైతులు వేసవిలో లోతుగా దుక్కులు దున్నుకుని ఉంటే భూమిలోపల ఉన్న క్రిములు చనిపోతాయన్నారు. దీని ఫలితంగా కాండం తొలచే పురుగులు ఏర్పడవన్నారు. ఉద్యానశాఖ శాస్త్రవేత్త డాక్టర్ మానస, కేవీకే తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త మాధురి

ఒంటిమిట్టకు ఎస్‌ఐని నియమించండి సారూ...

ఒంటిమిట్ట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) :ఒంటిమిట్టకు ఎస్‌ఐని నియమించండి సారూ అంటూ మండల ప్రజలు కోరుతున్నారు. ఒంటిమిట్టకు ఎస్‌ఐ లేక సుమారు నెలకు పైగా అయ్యింది. ఇక్కడ పని చేస్తున్న శివప్రసాద్‌కు బదిలీపై బి. మఠం వెళ్లారు. తర్వాత ఎవరినీ నియమించలేదు. ఎస్‌ఐ లేకపోవడంతో సీఐ వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు పేర్కొంటున్నారు. కడప - చెన్నై ప్రధాన రహదారిలో ఒంటిమిట్ట ఉంది. దీనికితోడు ఒంటిమిట్ట రాష్ట్ర గుర్తింపు కలిగిన కోదండరామస్వామి ఆలయం కూడా ఉంది. ప్రతినిత్యం ఆలయానికి వీఐపీలు వస్తూ ఉంటారు. వారికి భద్రత కల్పించాల్సి ఉంటుంది. ఎస్‌ఐ లేకపోవడంతో సిబ్బంది కొరత కారణంగా తాము కూడా ఇబ్బందులు పడుతున్నట్లు సిబ్బంది తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఎస్‌ఐని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సత్‌ప్రవర్తన కలిగి ఉండాలి : ఎస్‌ఐ



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి

నందలూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పాత ముద్దాయిలు సత్‌ప్రవర్తన కలిగి ఉండాలని ఎస్‌ఐ మల్లికార్జున సూచించారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో వివిధ కేసుల్లో పాత ముద్దాయిలకు ఎస్‌ఐ కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పాత ముద్దాయిలు భవిష్యత్‌లో ఎలాంటి నేరాలకు పాల్పకూడదని తెలిపారు. ఇటువంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని ఏదైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సుబ్బరాయుడు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కోదండరామ స్వామి ఆలయానికి రూ.20116 వితరణ

నందలూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అవరపల్లెలో వెలసిన కోదండరామ స్వామి ఆలయ అభివృద్ధికి పునగాని సుబ్బనరసయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు అంజన్‌కుమార్‌యాదవ్, గుణయాదవ్ రూ.20116 ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు గంపా సుధాకర్, నడివీధి సుధాకర్, మహేష్, ఆకుల చలపతి, గురివిగారి వాసు, ఆలయ ప్రధాన అర్చకులు సరసా రవికుమార్‌శర్మ గుణయాదవ్‌ను సన్మానించారు.

సోలార్ ఏర్పాటుపై సమీక్ష సమావేశం

చిన్నమండెం, జూన్10(ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం గురించి కన్స్యూమర్లు, విద్యుత్ సిబ్బందితో మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏడీ సూర్యకుమార్‌రెడ్డి, ఏఈ రాజేశ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ, ఏఈ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ పథకంలో ఒక కిలో వాట్సుకు 30 వేలు సబ్సిడీ ప్రభుత్వం సబ్సిడీ ప్రభుత్వం భరిస్తుందని అలాగే మూడు కిలోమీటర్లకు రూ.78 వేలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కన్స్యూమర్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతురాలి దహన సంస్కారాలకు చేయూత

పుల్లంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రెడ్డిపల్లె దళితవాడలో ఒంటరి మహిళ అయిన తాళ్లపాక సుబ్బమ్మ(82) మంగళవారం మృతిచెందడంతో ఆమె దహన సంస్కారాలకు గాను టీడీపీ మండల బీసీ నాయకులు రొంపిచెర్ల మురళి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. మృతురాలు సుబ్బమ్మ భర్త గతంలోనే మృతిచెందారు. పిల్లలు కూడా వెళ్లారు. సొంత ఇల్లు కూడా లేదు. దీంతో ఆమె దహస సంస్కారాలకు టీడీపీ బీసీ నాయకులు మురళి చేయూతనిచ్చారు.



ఆర్థిక సాయం అందిస్తున్న మురళి

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

నందలూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) :యువత చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కుర్రా మణియాదవ్, వాకర్స్‌క్లబ్ కార్యదర్శి ఉప్పుశెట్టి సుధీర్ పేర్కొన్నారు. మంగళవారం వారు క్రికెట్ సబ్‌సెంటర్‌లో చిన్న వయస్సులోనే బౌలింగ్‌లో ప్రతిభను కనబరుస్తున్న భారతాల సాత్విక్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ సభ్యులు మోడపోతుల రాము, గురుప్రసాద్, క్రికెట్ సబ్‌సెంటర్ కోచ్ ఫిరోజ్ ఖాన్, దివ్యాంగుల క్రికెట్ ప్రతినిధి శివకోటి, జంగంశెట్టి హరి, గుండు సురేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సాత్విక్‌ను అభినందిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు



పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం

సిద్దవటం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వ పాఠశాలలోనే బంగారు బాటలు వేయవచ్చునని ప్రధానోపాధ్యాయుడు అశ్వర్థరెడ్డి తెలిపారు. మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ మహబూబ్‌నగర్, వెంకటేశ్వపురం గ్రామాల్లో పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ వెంకటేశ్వరపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నత పాఠశాలగా ఎంపికైందన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. పాఠశాల చైర్మన్ బండి ఓబులేశు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తిరుపతమ్మ, రామకేశవ, శివప్రసాద్, సుదాకర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేత వై.కోట యూత్

రైల్వేకోడూరు రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడుగుంటపల్లి ప్రభుత్వ ఎలిమెంటరీ స్కూల్ నిర్వహించిన యూత్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలలో వైకోట యూత్ విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్ పోటీల్లో బుడుగుంటపల్లిపై వై.కోట జట్టు విజేతగా నిలిచింది. ప్రథమ స్థానం నిలిచిన విజేత జట్టుకు టీడీపీ రాష్ట్ర నాయకుడు ముక్కా విశాల్ రెడ్డి రూ.30 వేల చెక్కుతో పాటు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో స్ఫూర్తి నింపడం కోసం క్రీడలను ప్రాత్సహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు.

రైతుల సమస్యలపై వైఎస్ షర్మిలకు వినతి

వీర బల్లి, జూన్10(ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి రాయచోటి పీసీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయర మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గ వ్యాప్తంగా గత ఐదేళ్లగా మామిడి, అరటి పంటలు సరిగ్గా పండక ఇబ్బందులు ఎ దుర్కొంటున్నారని ప్రభుత్వం నుంచి రైతులకు ఎలాంటి సహాయం అందలేదని తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. మండలానికి ఒక కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం, మామిడి, టమోటా, అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

'ఈవీఎంలో మోసం అనడం సిగ్గుచేటు'

సంబేపల్లె, జూన్10(ఆంధ్రజ్యోతి): 'ఈవీఎంలో మోసం అనడం సిగ్గుచేటు' అని, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీకాంత్‌రెడ్డి పేర్కొనడం సిగ్గుచేటని మాజీ జెడ్పీటీసీ మల్లు నరసారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సంబేపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈవీయంల మోసంతోనే తాము ఓటమి పాలయ్యామని చెప్పుకోవడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. రాయచోటి నియోజకవర్గంలో 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా కొనసాగినా ప్రజలకు పనికొచ్చే ఒక్క మంచి పనిచేసినట్టు నిరూపించగలరా అని మండిపడ్డారు. మా నాయకుడు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రజల్లోకి చొచ్చుకొనిపోయి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మీ సొంత గ్రామంలోనే గత ఎన్నికలకు ఈ ఎన్నికలకు మెజార్టీ తేడా చూస్తే ప్రజల తీర్పు ఏమిటో అర్థమవుతుందన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతం



కంటి వైద్యశిబిరంలో పాల్గొన్న కొండూరు శరత్‌కుమార్‌రాజు, వైద్యులు

రాజంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా ఫౌండర్ చైర్మన్ భూపతిరాజు సహకారంతో ఒంటిమిట్ట మండలం రాచపల్లెలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా తిరుపతి వాసన్ ఐకేర్ ఆసుపత్రి వారిచే 155 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 29 మందికి శుక్లాలు ఉండటంతో వారికి ఆపరేషన్ అవసరమని నిర్వాహకులు తెలిపారు. మరో 30 మందికి అద్దాలు అందజేస్తామన్నారు. కడప ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ కొండూరు శరత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ మానవుని అవయవాల్లో కళ్లు ప్రధానం అన్నారు. కంటిచూపు లేకపోతే జీవితం అంధకారమవుతుందని పేర్కొన్నారు. అందుకే 'సర్వేంద్రియా నాం నయనం ప్రధానం' అన్నారని గుర్తు చేశారు. కంటిచూపును కల్పించాలన్నదే ఫౌండేషన్ ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎ.అంజనరాజు, ఎస్.శివరామరాజు, కె.రవిరాజు, భానుప్రకాష్‌రాజు, వాసన్‌కేర్ ఐకేర్ డాక్టర్ వెంకటేష్, టెక్నీషియన్‌లు, గ్రామ పెద్దలు రాధాకృష్ణమరాజు, శివరాజు పాల్గొన్నారు.

'ఉపాధి కూలీల పొట్టకొడితే ఊరుకోం'

రైల్వేకోడూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల పొట్టకొడితే ఊరుకోం అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, నియోజకవర్గ కార్యదర్శి ఎం. జయరామయ్య హెచ్చరించారు. మంగళవారం గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యలపై రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా రోజు వారి రూ.700కు పెంచాలని డిమాండ్ చేశారు. పని జరిగే ప్రాంతంలో ఫస్ట్‌ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి కూలీ మరణిస్తే ఆ కుటుంబానికి రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కే. వెంకటరమణ, ఏడీ నరసింహులు, శంకరయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మణి

ఉపాధి కూలీకి దినసరి వేతనం రూ.700 ఇవ్వాలి

పెనగలూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు రోజువారి రూ.700 దినసరి కూలి చెల్లించాలని బీకేఎంయూ నాయకులు రేవూరి కృష్ణయ్య, ఎర్రబెల్లి రవీంద్ర మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో జేఏకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ యేడాదికి 250 పనిదినాలు కల్పించాలని, దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా పనులు చూపించాలన్నారు.

ఓబులవారిపల్లె : మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి ఉపాధి కూలీల సమస్యలపై తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరామయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శి వెంకటరమణ, రమణ మాట్లాడారు.



టమోటా మార్కెట్ నిర్వహణపై అధికారుల నిర్లిప్తతతో అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయి. రైతుల వాహనాలు మార్కెట్‌లోకి రావడం నుంచి.. వ్యాపారుల లారీలు బయటకు వెళ్లడం వరకూ అన్నీ సమస్యలే. ఈ అంశాలన్నీ చివరకు రైతులు, వ్యాపారులతోపాటు ధరలపైకూడా ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా ఈ మార్కెట్‌కు రోజూ వచ్చే సరుకు, కొనుగోలుదారులు, ధరల వివరాలను ఇతర మార్కెట్‌లతో పోల్చి చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ ఓ పద్ధతి, నియమం, పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణం. మార్కెట్‌కు వచ్చే సరుకుకు అనుగుణంగా విశాలమైన స్థలం లేకపోవడం.. ఉన్నా సరైన పద్ధతిలో వినియోగించుకోక పోవడంతో ట్రాఫిక్ సమస్యలు కూడా ఇబ్బందికరంగా మారుతున్నాయి.

టమోటా మార్కెట్ అస్తవ్యస్తం!

- పెరుగుతున్న సాగు విస్తీర్ణం.. ● మార్కెట్‌ను ముంచెత్తుతున్న దిగుబడులు
- రోడ్లను ఆక్రమించిన వ్యాపారులు
- బారులు తీరిన వాహనాలు ● గంటల తరబడి నిరీక్షణ
- బయటి మార్కెట్లకు కొనుగోలుదారులు ● ధరలపై ట్రాఫిక్ ప్రభావం

మదనపల్లె, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోటా మార్కెట్‌కు ఆసియాలోనే పెద్దమార్కెట్‌గా పేరుంది. అయితే ఆ స్థాయిలో ఇక్కడ సౌకర్యాలు, వసతులు లేవు. 1985లో అప్పటి సాగు విస్తీర్ణాన్ని బట్టి స్థానిక నీరుగట్టువారిపల్లె సమీపంలో 20 ఎకరాల్లో టమోటా మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో కొందరు రైతులు మాత్రమే టమోటా సాగు చేస్తుండగా, ప్రస్తుతం వ్యాపారులు, ఉద్యోగులు, అన్ని వర్గాలవారు టమోటా సాగు చేస్తున్నారు. దీంతో ఏటికేడు పంట సాగు విస్తీర్ణంతోపాటు దిగుబడి కూడా గణనీయంగా పెరుగుతోంది. అదే ఇప్పుడు అన్ని సమస్యలకు కారణమవుతోంది. ఒకప్పుడు సీజన్‌లో మాత్రమే సాగయ్యే టమోటా.. ప్రస్తుతం సీజన్‌తో పనిలేకుండా ఏడాది పొడవునా ఉంటోంది. ప్రధానంగా ఫిబ్రవరిలో పంటసాగు మొదలై.. నవంబరు వర్షాలతో పూర్తవుతుంది. ఈ మధ్య కాలంలో ధరలు రైతుల దశ, దిశను మార్చేస్తుంటాయి. వస్తే లాభం, లేకుంటే నష్టం, మధ్యతరహాగా తీసుకుంటే పెట్టుబడి వస్తుంటుంది. దీంతో ఒక పంటలో నష్టం వచ్చినా, మరో పంట ఆదుకుంటుందనే నమ్మకంతో ప్రతిరైతు దాదాపుగా మూడు అదునల్లోనూ కొంత విస్తీర్ణంలో సాగు టమాటా చేస్తుంటాడు.

వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య

జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలతోపాటు సమీపంలోని కర్ణాటక ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా ఈఏడాది విస్తారంగా టమోటా సాగైంది. మే నెల రెండోవారం నుంచే మొదలైన దిగుబడి.. క్రమంగా పెరుగుతోంది. 500 మెట్రిక్ టన్నుల నుంచి మొదలైన టమోటా దిగుబడి.. ప్రస్తుతం రెండువేల టన్నులను దాటేసింది. ధరలు కూడా ఇదే స్థాయిలో హెచ్చుతగ్గులతో కదులుతున్నాయి. మదనపల్లె మార్కెట్‌లో ఆదివారం గరిష్ఠంగా 28 కేజీల క్రేట్ రూ.500 నుంచి రూ.550 వరకు పలికింది. ఇక రెండో రకం రూ.350-400, మూడో రకం రూ.300-రూ.250 పలికింది. దిగుబడులు, ధరల విషయాన్ని పక్కన పెడితే, అటు రైతులు, ఇటు వ్యాపారులను ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతున్నాయి.

తాజా సాగు విస్తీర్ణం, దిగుబడులను పరిగణలోకి తీసుకుంటే.. ఇప్పుడు మార్కెట్‌కు మరింత విశాలమైన స్థలం కావాల్సి ఉంది. ఇప్పుడున్న 20 ఎకరాల్లో అయిదు ఎకరాలు ఇతర విభాగాలకు పోగా, మిగిలిన 15 ఎకరాల్లో 50 వరకూ కమీషన్, ట్రేడ్ లైసెన్సు మండీలు నడుస్తున్నాయి. ఉన్న మండీ యజమానులు స్థలాలతోపాటు రోడ్లను కూడా ఆక్రమించేశారు. కొంత రోడ్డు ఉన్నా.. అక్కడికి వచ్చే ట్రాక్టర్లు, లారీలను లోడింగ్ పేరుతో గంటల తరబడి నిలిపేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో రైతుకు చెందిన ట్రాక్టరు లోపలికి వెళ్లాలన్నా, వ్యాపారికి చెందిన లారీ బయటకు రావాలన్నా కనీసం పది గంటల సమయం పడుతోంది. దీంతో కొనుగోలు చేసిన సరుకును సమయానికి బయటి మార్కెట్‌కు చేర్చలేక వ్యాపారులు, సరుకును మార్కెట్‌కు తెచ్చే రైతు మండీకి వెళ్లడానికి నిరీక్షించలేక సహనం కోల్పోతున్నారు. దీంతో కొందరు రైతులు, వ్యాపారులు బయటి మార్కెట్లకు తరలిపోతున్నారు. ఈ పరిస్థితి ధరలపై ప్రభావం చూపుతోంది.



మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

బారులుతీరుతున్న వాహనాలు

బయటి ప్రాంతాల నుంచి వచ్చే రైతుల ట్రాక్టర్లు నీరుగట్టువారిపల్లెలోని మార్కెట్‌యార్డు ఎదుట బారులు తీరుతున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు క్యూలో వచ్చి నిలబడితే, లోపలకు వెళ్లడానికి సాయంత్రం ఆరు అవుతోంది. అక్కడ మండీలో కాయలను అన్‌లోడ్ చేసి, తిరిగి బయటకు రావడానికి రాత్రి పది గంటలు అవుతోంది. ఇలా రోడ్డుపై నిరీక్షిస్తున్న ట్రాక్టర్లు, మినీ వ్యాన్‌లు మార్కెట్ నుంచి అమ్మచెరువుమిట్ట, అటు గొల్లపల్లె బైపాస్‌రోడ్డు వరకూ బారులు తీరుతున్నాయి. అలాగే మండీలలో కొనుగోలు చేసిన టమోటాలను బాక్సులు మార్చి లోడ్ చేసి బయటకు తరలించడానికి ఆరేడు గంటలు పడుతోంది. దీంతో వ్యాపారుల లారీలు బయటకు వెళ్లే వరకూ అప్పటికే మార్కెట్‌కు కాయలు తెచ్చిన వాహనాలు రోడ్డుపై నిరీక్షించాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని ఎవరూ అదుపు చేయలేకపోతున్నారు. చివరకు మార్కెట్ మార్కెట్ అధికారులు కూడా చేతులెత్తేస్తున్నారు. అలాగే చౌకదుకాణాలకు బియ్యం, ఇతర నిత్యావసరాలు సరఫరా చేసే గోదాము కూడా ఇక్కడే ఉండటంతో లారీలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ నిత్యావసర వస్తువులు సకాలంలో రేషన్‌షాపులకు సరఫరా చేయలేక పోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కొన్నేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. ఇదిలా ఉండగా, కొన్ని మండీల యజమానులు స్థానిక టిప్పూసుల్తాన్ మైదానంలో తాత్కాలికంగా మండీలు నిర్వహిస్తున్నారు. కొందరు రైతులు సైతం సమీపంలోని ఇతర మార్కెట్ల కాయలను తీసుకెళ్తుండగా, వ్యాపారులు కూడా అక్కడికే వెళ్తున్నారు. ఈ పరిస్థితి ప్రధాన మార్కెట్‌లో ధరలపై ప్రభావం చూపుతోంది. ఇక మార్కెట్‌లో శానిటేషన్ పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఈ అంశాలపై అధికారులు దృష్టి సారిస్తే తప్ప.. పరిస్థితి మెరుగుపడదని అటు రైతులు, ఇటు వ్యాపారులు వాపోతున్నారు.



నీరుగట్టువారిపల్లెలో రోడ్డుపై బారులు తీరిన వాహనాలు



ట్రాఫిక్ సమస్యతో మార్కెట్‌లో నిలిచిపోయిన వాహనాలు

ప్రజా దర్బార్‌తో సమస్యలకు తక్షణ పరిష్కారం



సమస్యలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో రాయచోటి నియోజకవర్గంలోని ప్రజలు సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి నియోజకవర్గంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రి స్వీకరించి వాటిని అక్కడికక్కడే పరిష్కరించామన్నారు.

ఎన్‌బీకే ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం



సినీహీరో బాలకృష్ణకు చెక్కు అందజేస్తున్న లోకేశ్ కొణెదల

మదనపల్లె టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ జన్మదినం సందర్భంగా మదనపల్లె టీడీపీ నేత లోకేశ్ కొణెదల హైదరాబాద్‌లో మంగళవారం బాలకృష్ణను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్‌బీకే ట్రస్టుకు రూ.5,55,555 విరాళం అందజేశారు. మదనపల్లెలో టీడీపీ బలోపేతానికి మరింత కృషి చేయాలని సూచించినట్లు లోకేశ్ మీడియాతో తెలిపారు.

అండర్‌పాస్ ఏర్పాటుతో.. దారి సమస్య పరిష్కారం



భోగంపల్లె రిజర్వాయర్ సమీపంలో ఏర్పాటు చేసిన అండర్‌పాస్

వాల్మీకిపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పనుల కారణంగా పట్టణ సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో పొలాలకు వెళ్లేందుకు దారి సమస్య ఏర్పడిందని ఏడాది క్రితం రైతులు రహదారి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎన్‌హెచ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా అండర్ పాస్ ఏర్పాటు చేశారు. దాదాపుగా 400 ఎకరాలకు పైగా సాగు భూములు ఉన్న ప్రాంతంలో జాతీయ రహదారి పనులు చేపట్టడంతో తమ పొలాలకు దారి లేకుండా పోతుందేమోమని ఆందోళన చెందామని, ఒకవేళ జాతీయ రహదారి పూర్తి చేసి ఉంటే తమ భూములకు దారి మాట ఎలా ఉన్నా సుమారు 4 నుంచి 5 కిలోమీటర్లు ప్రదక్షిణ చేయాల్సి వచ్చేదన్నారు. భోగం పల్లె రిజర్వాయర్ కుడికాలువ పనులతో పాటు తమ పొలాలకు అను గుణంగా అండర్ పాస్ నిర్మాణం పూర్తి చేయడంపై రైతులు ఎన్‌హెచ్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నరసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న అధికారులు

గుర్రంకొండ, జూన్ 10 (ఆంధ్ర జ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వారి హుండీని మంగళవారం టీటీడీ అధికారులు లెక్కించారు. ప్రతి మూడు నెలలకోసారి స్వామి వారి హుండీని లెక్కిస్తారు. స్వామి వారికి హుండీ ద్వారా రూ.14,84,740 ఆదాయం వచ్చినట్లు ఆలయాధికారి కృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లె సబ్‌జైలు సూపరింటెండెంట్ బదిలీ

మదనపల్లె టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె స్పెషల్ సబ్‌జైలు సూపరింటెండెంట్ రామకృష్ణ బదిలీ అయ్యారు. ఐదేళ్లకు పైగా ఇక్కడ విధులు నిర్వహించిన ఆయనను తిరుపతి సబ్ జైలు సూపరిం టెండెంట్‌గా నియమిస్తూ జైళ్లశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం జైలు సిబ్బంది ఆయనకు వీడ్కోలు పలికారు. మదనపల్లె సబ్ జైలు సూపరింటెండెంట్‌గా రాజమండ్రి సబ్‌జైలులో పని చేస్తున్న కె.లక్ష్మణరావు నియమితులయ్యారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష

రాయచోటిటౌన్, జూన్10(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పరిధిలోని మదనపల్లె, రాజంపేట, రాయచోటి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆరు పరీక్ష కేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలు అత్యంత పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నా రు. జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులు మదనపల్లెలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాల, మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల, ఆధిత్య ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు రాజంపేటలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల, ఆస్కార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలను పర్యవేక్షించారు మంగళవారం 6 పరీక్ష కేంద్రాల్లో 1558 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1446 మంది హాజరు కాగా 112 గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలియజేశారు.

బాలిక మృతిపై విచారణ చేయాలి

మదనపల్లె టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంజునాథ కాలనీలో బాలిక మృతిపై పోలీసులు సమగ్ర విచారణ చేయించాలని ఐద్వా కన్వీనర్ భాగ్యమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద మస్తాని తల్లిదండ్రులు గఫూర్, హసీనాలను ఐద్వా నాయకురాళ్లు పరామర్శించారు. మస్తాని ఎలా మృతి చెందింది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. భాగ్యమ్మ మాట్లాడుతూ మస్తాని మృతి వివరాలు తెలిపేందుకు ఆమె తల్లిదండ్రులు భయపడుతున్నారని, పోలీసులు నిష్పక్ష పాతంగా దర్యాప్తు చేసి న్యాయం చేయాలని వారు కోరారు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి

- స్కౌట్స్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి

రాజంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించుకోవాలని స్కౌట్, గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎం.నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాజంపేట బాలికోన్నత పాఠశాలలో గైడ్స్ విద్యార్థులకు గత 5 రోజులుగా నిర్వహిస్తున్న తృతీయ సోపాన్, రాజ్య పురస్కార్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నిజాయితీ, సేవాగుణం, ధైర్య సాహసాలు పెంపొందుతాయన్నారు. స్కౌటిజం ద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. స్కౌట్ శిక్షణ పొంది సర్టిఫికెట్లు ఉన్న విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ ఉంటుందన్నారు. కావున, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అసిస్టెంట్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తృతీయ సోపాన్ శిక్షణకు 92 మంది, రాజ్య పురస్కార్ శిక్షణకు 12 మంది గైడ్స్ విద్యార్థులు హాజరయ్యారన్నారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఏవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలి, నైతిక విలువలు, దేశభక్తి, సేవాభావం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, గైడ్స్ లీడర్, ట్రైనర్ శకుంతల, హెచ్‌డబ్ల్యూ బి.నిర్మల, అడ్వాన్స్ గైడ్ కెప్టెన్లు శివలీల, కనకదుర్గ, సుజాత, బేసిక్ గైడ్స్ కెప్టెన్‌లు గోవిందమ్మ, శ్యామల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి

సీసీ వైఖరికి నిరసనగా డ్వాక్రా సభ్యుల ఆందోళన

సిద్దవటం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా డ్వాక్రా సీసీ ప్రవర్తించడం తగదని డ్వాక్రా మహిళలు అన్నారు. సిద్దవటం మండలం మాధవరం-1లో మంగవారం వారు మాట్లాడుతూ సిద్దవటం మండలం మాధవరం-1 పరిధిలోని యానిమేటర్‌గా పనిచేస్తున్న సులోచన కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడేవారన్నారు. అప్పట్లో సంబంధించిన అధికారులు ఆదేశించిన పనులను నిర్వర్తించడంలో ఆమె విఫలమయ్యారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని సంబంధిత సీసీ ఆమెను తప్పించాలన్న ఉద్దేశంతో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆమె కోలుకుని విధులను నిర్వర్తించడానికి సిద్ధంగా ఉన్నా సీసీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించారన్నారు. గతంలో ఆమె విధులు సక్రమంగా నిర్వహిస్తూ లక్ష్యాలను సాధించారన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు విచారించి ఆమెకు తగు న్యాయం చేయాలని, ఆమెను విధుల్లో కొనసాగించాలని డ్వాక్రా సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఏపీఎం సుజాతను వివరణ కోరగా జరిగిన విషయం పరిశీలించి తగు న్యాయం చేస్తామని ఆమె సూచించారు.



ఆందోళన చేస్తున్న మహిళలు

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

మదనపల్లె టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సీటీఎం రోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నిబంధనలు విరుద్ధంగా కడుతున్న కమర్షియల్ భవనాలపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఫిర్యాదు చేశారు. మంగళవారం సబ్ కలెక్టరేట్ డీఏఓ రాఘవేంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్టేట్‌లో కార్మికులకు ఉపాధి కల్పించే పరిశ్రమలను నెలకొల్పాలే కానీ, పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని తక్కువ ధరలకు స్థలాలు తీసుకుని, వాటిలో కమర్షియల్ భవనాలు నిర్మిస్తూ కార్మికుల పొట్టకొడుతున్నారన్నారు. దీనిపై ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా ఆయన పట్టించుకోలేదన్నారు. ఈ విషయమై విచారణ చేసి తగుచర్యలు తీసుకోవాలని పునీత్ కోరారు. హరికృష్ణ, జిలాని, నవీన్, శశికుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టరేట్ డీఏఓకు వినతి పత్రం సమర్పిస్తున్న బీవైఎస్ నేతలు

కిశోర వికాసంపై యువతులకు అవగాహన

బి.కొత్తకోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కిశోర వికాసం కార్యక్రమం ద్వారా కిశోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించామని బి.కొత్తకోట ప్రాజెక్టు సీడీపీఓ భాగ్యమ్మ తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని తాకాటంవారిపల్లి సచివాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, సైబర్‌నేరాలు, మహిళా రక్షణ కోసం ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలు, బాల్యవివాహాలతో అనర్థాలు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలను శిక్షణా తరగతుల్లో వివరించామని, గ్రామాల్లో ఆయా అంగన్‌వాడీ కేంద్ర కార్యకర్తల ద్వారా విపులంగా తెలియపరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హిజాద్‌ప్యారీ, జీఎంఎస్కే సుమతి, వెల్ఫేర్ ఉద్యోగి మౌలా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ భాగ్యమ్మ

తంబళ్లపల్లె: బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిషోర వికాసం ఎంతగానో దోహదపడుతుందని మహిళా సంరక్షణ కార్యదర్శి భారతి అన్నారు. మంగళవారం మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో కిషోర వికాసంపై అవగాహన కల్పించారు. రక్తహీనత, ఐరన్ లోపం వలన కలిగే నష్టాలు, రక్తహీనత నివారణ, ఆరోగ్యం, పోషణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అపోర్డు సంస్థ సిబ్బంది బాల్య వివాహాలతో నష్టాలు, బాలికల విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో అంగన్వాడీ కార్యకర్తలు ఉమ, కళావతి, సరస్వతి, మహిళా పోలీసులు, మహిళలు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

కలకడ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నాటు సారా విక్రయిస్తున్న రాజానాయక్ అనే వ్యక్తి ని మంగళవారం అరెస్టు చేసినట్లు రాయ చోటి ఈఎస్‌టీఎఫ్ సీఐ ఎల్లయ్య తెలిపారు. కలకడ మండలం బాలయ్యగారిపల్లెలో అత ని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసున్నట్లు వివరించారు. అతనికి నాటు సారా సరఫరా చేసిన సంబేపల్లె మండలం శెట్టిపల్లె పెద్దబిడికికి చెందిన ఆదిరెడ్డినాయక్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా సారా అమ్మినా, రవాణా చేసినా, దాచిఉంచినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది మోహన్‌రెడ్డి, హుస్సేన్, బాలకృష్ణ, జానీ పాల్గొన్నారు.



నిందితుడిని చూపుతున్న పోలీసులు

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

కురబలకోట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పీటీఎం మండలం ఉప్పరోళ్లపల్లెకు చెందిన లక్ష్మీదేవి (46)భర్తతో విడిపోయి, కూలి పనులు చేసుకుంటూ మదనపల్లె పట్టణం చంద్రా కాలనీలో ఒంటరిగా జీవిస్తోంది. పక్క కాలనీకి ఒక వ్యక్తితో సన్నిహితంగా ఉండేది. ఈమెకు పిల్లలు లేరు. కాగా, మంగళవారం ఉదయం మండలంలోని సర్కారు తోపు సమీపంలో జాతీయ రహదారి పక్కన చెట్టుకు ఉరేసుకున్న స్థితిలో ఆమె మృతదేహం కనిపించింది.. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ వివాదంలో దంపతులపై దాడి

కురబలకోట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): భూ వివాదం కారణంగా ప్రత్యర్థులు దంపతులపై దాడి చేసి గాయపరిచారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ బండపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి, వెంకటరమణారెడ్డి సోదరులు. వీరికి గ్రామంలో కొంత భూమి ఉంది. అయితే ఈ భూమి విషయమై పలుమార్లు గొడపడ్డారు. ఈ భూమి సర్వే చేసేందుకు శ్రీనివాసులు రెడ్డి చలానా కట్టాడు. అయితే అధికారులు సర్వే చేసేందుకు రాగా ఇరువురి మధ్య వాగ్వా దం జరిగింది. దీంతో ఆగ్రహించిన వెంకట రమణారెడ్డి భార్య లక్ష్మీదేవి, కుమారులు చంద్రశేఖర్‌రెడ్డి, శివకృష్ణారెడ్డిలు శ్రీనివాసులురెడ్డి అతని భార్య అమరావతిపై దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో అమరా వతి చేయి విరిగింది. బాధితురాలిని కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలకు రూ. 56 వేలు జరిమానా

పీలేరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలపై అకస్మిక దాడులు నిర్వహించి రూ. 56,510 జరిమానా వసూలు చేసినట్లు పీలేరు ఎంవీఐ విజయకుమారి తెలిపారు. మంగళవారం పీలేరు- సుండుపల్లె రోడ్డులోని కేవీపల్లె మండలం గర్నిమిట్ట వద్ద ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలపై అకస్మికంగా దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా, కెపాసిటీకి మించి ప్రయాణికులను తరలిస్తున్న తొమ్మిది ఆటోలను నిలిపి రూ. 56,510 జరిమానా విధించారు. ఇకపై అక్రమంగా ప్రయాణికులను తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పీలేరు ఆర్టీసీ డీఎం పీ. నిర్మల, ఆర్టీసీ డిపో మేనేజర్ బాబునాయక్ పాల్గొన్నారు.

'పని గంటల పెంపు దుర్మార్గం'

మదనపల్లె, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం చేసిన కార్మిక వ్యతిరేక నిర్ణయాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీయూ కార్యాలయంలో మంగళవారం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎనిమిది గంటల పని విధానం కొనసాగించాలన్నారు. రాష్ట్రంలో కార్మిక చట్టాలను మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. 50 లక్షల మంది కార్మికులకు 13 సంవత్సరాలుగా కనీస వేతనాల సవరణ జరగలేదన్నారు. 20 లక్షల మందికిపైగా పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కూటమి ప్రభుత్వం పునరుద్ధరించలేదన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్ప, చంద్రశేఖర్, ఏఐటీయూసీ నాయకులు మస్తాన్, ముబారక్, తిరుమల, దేవా, చలపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి ఆత్మహత్యాయత్నం

- ఇద్దరిని కాపాడిన రైల్వే పోలీసులు
- కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబం వద్దకు చేర్చిన వైనం

ఎర్రగుంట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు చోట్ల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను రైల్వే ఆర్ఎస్ఐ రవిచంద్ర, ఆర్పీఎఫ్ బృందం కాపాడింది. వివరాల్లోకి వెళితే... పెనికలపాడు గ్రామానికి చెందిన పల్లేటి మునిస్వామి కుటుంబ కలహాలతో సోమవారం రాత్రి 9.50 గంటల ప్రాంతంలో కలమల్ల రైల్వే స్టేషన్ సమీపంలో ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చాడు. గమనించిన రైల్వేస్టేషన్ మాస్టర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జీఆర్పీ ఆర్ఎస్ఐ రవిచంద్ర, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ శివకుమార్‌లు అక్కడికి చేరుకుని మునిస్వామికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం పెనికలపాడుకు వెళ్లి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. అలాగే ఎర్రగుంట్లలో సోమవారం రాత్రి 9గంటల సమయంలో కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకునేందుకు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌కు రాగా... గమనించిన రైల్వే పోలీసులు, ఆర్ఎస్ఐ రవిచంద్ర, సిబ్బంది అతనిని కాపాడారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి వారి భార్యా పిల్లలకు అప్పగించారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

దువ్వూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లె సమీపంలోని ఫారెస్టు పరిధిలో మంగళవారం నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు అక్రమంగా దుంగలు తరలిస్తున్న దాసరిపల్లెకు చెందిన బసప్ప, సుబ్రమణ్యం, బాస్కరయ్య అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వీరు నెల కిందట 12 దుంగలు కొట్టి వాటిలో ఎనిమిది దుంగలను తరలించారని, మిగతా నాలుగు దుంగలను తరలిస్తుండగా ఫారెస్టు బీట్ ఆఫీసర్ సుచరిత, కానిస్టేబుల్ ఓబులేసుతో కలిసి నిందితులను అరెస్టు చేసి దుంగలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు వివరించారు.

యువకుడు ఆత్మహత్య


ప్రశాంత్ (ఫైల్)

వీరపునాయునిపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లెలోని ఎస్సీకాలనీకి చెందిన లింగదారి ప్రశాంత్ (23) అనే యువకుడు ఆత్మ హత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. ప్రశాంత్ తన తల్లి చనిపోవడంతో తరుచూ మనస్థాపానికి గురయ్యేవాడు. నాలుగు రోజుల క్రితం తండ్రితో తనకు పెళ్లి చేయమని వాదనకు దిగేవాడని, పెళ్లిచేయలేదని బాధతో మద్యం మత్తులో ఇంట్లోనే ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కూల్‌డ్రింక్ షాపులో చోరీ

బద్వేలుటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని కూల్‌డ్రింక్ షాపులో మంగళవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. కూల్‌డ్రింక్ షాపునకు తాళాలు వేసినవి వేసినట్లే ఉన్నా, దొంగలు ఎంతో చాకచక్యంగా షాపు పైకప్పు బాగంలో రేకులను కట్టర్ సాయంతో కట్‌చేసి లోపలికి ప్రవేశించారు. షాపులో ఉన్న రూ.10వేల నగదు, రూ.30వేలు విలువ చేసే సిగరేట్లు తదితర సామాగ్రిని దోచు కెళ్లారు. దుకాణ దారుడు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆరు నెలల క్రితం ఇదే తరహాలో పక్క షాపులో చోరీ జరగడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు దొంగతనాలపై నిఘా పెట్టాలని కోరుతున్నారు.

గొడ్డలితో దాడి...కేసు నమోదు

ముద్దనూరు జూన్ 10 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి దేనేపల్లెలో మంగళవారం ఉదయం బోల రామ్మోహన్‌పై గొడ్డలితో దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షైనుద్దీన్ తెలిపారు. శనివారం బోల రామ్మోహన్ ఇంటిలో ఫంక్షన్ జరిగింది. అదే గ్రామానికి చెందిన ఉత్తయ్య ఫంక్షన్‌లో తన మనుషులను పనికి పిలవకుండా వేరే వ్యక్తులను పెట్టుకున్నాడని రామ్మోహన్‌ను కొడతామని హెచ్చరించాడు. ఉదయం రామ్మోహన్ పొలంలో ఉండగా ఉత్తయ్య తన మనుషులతో కలిసి ఉద్దేశ్య పూర్వకంగా గొడ్డలితో దాడి చేయడంతో రామ్మోహన్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఉత్తయ్య, శివ, శివశంకర్, లక్షుమయ్య, నరసింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లైంగిక వేధింపులు...కేసు నమోదు

మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన బోల రామ్మోహన్ అనే వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షైనుద్దీన్ తెలిపారు. రామ్మోహన్ పొలం పనిచేసేందుకు వెళ్లిన మహిళను లైంగికంగా వేధించడంతో తప్పించుకొని ఇంటికి వెళ్లింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రామ్మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

కడప క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం కోఆపరేటివ్‌కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న భవనం రెండో అంతస్థు నుంచి పడి వెంపటి శ్రీనివాసరావు(40) మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. గుంటూరుకు చెందిన శ్రీనివాసరావు బేల్దారి పని నిమిత్తం కడపకు వచ్చారు. ఆయన పని చేస్తున్న సమయంలో పైనుంచి పడి మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి అన్న సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నలుగురు తహశీల్దార్లు బదిలీ

కడప కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాలో నలుగురు తహశీల్దార్లను బదిలీచేస్తూ కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బ్రహ్మంగారిమఠంలో పనిచేస్తున్న తహశీల్దారు డి.దామోదరరెడ్డిని ఒంటిమిట్టకు, ఒంటిమిట్టలో పనిచేస్తున్న రమణమ్మను ఖాజీపేటకు బదిలీ చేశారు. ఖాజీపేటలో పని చేస్తున్న తహశీల్దారు డి. మహబూబ్‌బాషాను జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో కేఆర్‌సీసీ తహశీల్దారుగా, గోపవరం మండల తహశీల్దారుగా పని చేస్తూ కలెక్టరేట్‌లో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఆర్.జీవన్ చంద్రశేఖర్‌ను ముద్దనూరు తహశీల్దారుగా బదిలీ చేసి, అక్కడ నుంచి డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌లోని డి-సెక్షన్ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా జిల్లాలో భారీగా తహశీల్దార్ల బదిలీలు ఉంటాయని భావించారు. అధికార పార్టీ నేతలు కొందరికి రెకమెండేషన్ లెటర్స్ ఇప్పించినప్పటికీ కలెక్టర్ తనదైన శైలిలో తహశీల్దార్ల బదిలీలు చేయడం గమనార్హం. ఇకపోతే అన్నమయ్య జిల్లా నుంచి ముగ్గురు డిప్యూటీ తహశీల్దార్లు బదిలీపై జిల్లాకు రానున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 8 మంది డీటీలకు త్వరలో తహశీల్దార్లుగా పదోన్నతులు లభించే అవకాశాలున్నట్లు సమాచారం.

మహిళపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు


శిక్ష పడిన ముద్దాయిని చూపుతున్న పోలీసులు

చెన్నూరు జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారానికి పాల్పడ్డ కేసులో బరకం వెంకటేశ్ అనే వ్యక్తికి కడప 7వ ఏడీజే కోర్టు న్యాయ మూర్తి ఎ.రమేశ్‌కుమార్ జీవితఖైదుతో పాటు రూ.లక్షా 50 వేలు జరిమానా విధించారు. పోలీసుల కథనం మేరకు..

చెన్నూరు మండలంలోని ఓ గ్రామ సచివాలయం పరిధిలో వలంటీరుగా పనిచేస్తున్న మహిళకు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన బరకం వెంకటేశ్ పరిచయం అయ్యాడు. ఇద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునే వారు. వెంకటేశ్ ఆ మహిళపై ప్రేమ ఉన్నట్లు నటించి పెళ్లి చేసుకుందామని నమ్మించి కడప నగరంలోని ఓ లాడ్జికి పిలిపించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆ తరువాత మహిళ పెళ్లి ప్రస్తావన తీసుకురావడంతో నిరాకరించడంతో పాటు దుర్భాషలాడాడు. దీనిపై 2021 జూన్ 20న బాధితురాలి ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేశారు. అనంతరం విచారణను అప్పటి కడప రూరల్ సీఐ మహ్మద్ ఆలీకి అప్పగించారు. సీఐ దర్యాప్తు చేసి వెంకటేశ్‌ను అరెస్టు చేసి కడప 7వ ఏడీజే కోర్టు జడ్జి ఎదుట విచారణకు హాజరుపరిచారు. ప్రస్తుత సీఐ క్రిష్ణారెడ్డి సంబంధిత సాక్షులను సకాలంలో హాజరు పరిచారు. బాధితురాలి తరపున ఎం.యాస్మిన్ వాదనలు వినిపించారు. ఈ మేరకు వెంకటేశ్ నేరం చేసినట్టుగా రుజువు కావడంతో అతడికి జీవిత ఖైదుతో పాటు రూ.1.50 లక్షలు జరిమానా విధిస్తూ మంగళవారం జడ్జి తీర్పు ఇచ్చారు.

రైతులకు నష్టం జరగకుండా చూడాలి : ఆర్డీవో


హైపవర్ విద్యుత్తు లైను వెళ్లే పొలాలను పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దారు తదితరులు

సీకేదిన్నె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా హైపవర్ విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయాలని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. మంగళవారం చింతకొమ్మదిన్నె గంగమ్మ ఆలయం సమీపంలో హైపవర్ విద్యుత్తు లైన్లు వెళ్లే పొలాలను సీకే దిన్నె తహసీల్దారు నాగేశ్వరరావు, రైతులు, పవర్‌గ్రిడ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైవేకు సమాంతరంగా విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని, అదే సమయంలో రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. రైతులకు అన్యాయం జరగకుండా రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని చింతకొమ్మదిన్నె చెరువు నుంచి గుట్టపై నుంచి డిజైన్ మార్చుకోవాలన్నారు. అలా కాకుండా రైతుల విలువైన భూములు కోల్పోయే విధంగా చేయరాదన్నారు. అంతకుమునుపు చింతకొమ్మదిన్నె, కొలుములపల్లె, జమాల్‌పల్లి, ఇప్పెంట, తదితర గ్రామాల రైతులు పవర్‌గ్రిడ్ స్టేషన్‌కు వెళ్లి నిరసన తెలిపేందుకు వెళ్లారు. అయితే ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న 765 కేవీ విద్యుత్తు లైను డిజైన్లు పవర్‌గ్రిడ్‌వారు చేయడం లేదని.. స్టెరిలైట్ కంపెనీ వారు చేస్తున్నారని తెలుసుకుని రైతులు తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో తహసీల్దారు రైతుల ఇబ్బందులను ఆర్డీవోకు వివరించడంతో ఆర్డీవో స్వయంగా వచ్చి రైతుల భూములను, విద్యుత్తు లైను వెళ్లే మార్గాన్ని పరిశీలించి వారికి డిజైన్ మార్చుకోవాలని సూచించారు. అదే విధంగా ఈ కంపెనీ వారు ఈనెల 10లోగా తమ అభ్యంతరాలు తెలియజేయాలని పత్రికా ప్రకటన ఇచ్చి ఆ అడ్రస్‌లో వారు లేకపోవడంతో అభ్యంతరాలు తెలిపేందుకు తాము డిల్లీకి వెళ్లి ఎన్నో వ్యయప్రయాసలకు గురైనట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జిల్లా సహకార అధికారిగా వెంకటసుబ్బయ్య



కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార అధికారిగా ఎం.వెంకటసుబ్బయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుదీర్ఘకాలంగా ఈ పోస్టును ఇన్‌చార్జి అధికారులతోనే నెట్టుకొచ్చారు. నంద్యాలలో పనిచేస్తూ కడప డీసీవోగా నియమితులైన వెంకట సుబ్బయ్య గతంలో మెప్మా పీడీగా, డీఆర్‌డీఏ పీడీ, ఎస్ఎస్ఏ పీవోగా జిల్లాలో పనిచేశారు. ఎన్టీఆర్ జిల్లా సహకార అధికారిగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరెడ్డిని ప్రొద్దుటూరు లోని సహకార శిక్షణ కేంద్రం అధ్యాపకుడుగా నియమించారు. కడప జిల్లా మైన్స్ జియాలజీ అధికారిగా డి.వెంకటసాయిని నియమించారు. గుంటూరు జిల్లాలో డీఎంజీవోగా ఆయన ఇప్పటి వరకు విధులు నిర్వహించే వారు. బాపట్ల ఏడీఎంగా పనిచేస్తున్న ఆర్.రాజేశ్‌కుమార్‌ను రాయచోటి డీఎంజీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పరారీలో ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ

పులివెందుల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి పరారీలో ఉన్నారు. పోలీసు వర్గాల కథనం మేరకు.. మహానాడు సందర్భంగా గత నెల 28వ తేదీన టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పులివెందులలోని పార్నపల్లె రింగురోడ్డు సర్కిల్ నుంచి కడప రింగురోడ్డు సర్కిల్ వరకు ఆయా సర్కిళ్లలో టీడీపీ తోరణాలు, ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేశారు. అయితే వైసీపీకి చెందిన కొంతమంది వీటిని పీకేసి, ఫ్లెక్సీలను చించేశారు. అదే సమయంలో వైసీపీకి చెందిన వారు మారణాయుధాలతో తనను చంపేందుకు వెంబడించారని టీడీపీ నేత విజయ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పట్లోనే 15 మందిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్‌తో పాటు 13 మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. మిగిలిన ఇద్దరూ ఇంకా పోలీసులకు చిక్కలేదు. వీరిలో అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి కేసు నమోదైన రోజు నుంచి పరారీలో ఉన్నట్లు సమాచారం. పరారైన మరో వ్యక్తి ఎవరనేది పోలీసులు వివరాలు వెల్లడించలేదు. వీరిద్దరినీ అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రత్యేక బృందాల ద్వారా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

కర్నూలు, కడప జట్ల విజయం


రణధీర్‌రెడ్డి, కడప(54 పరుగులు), విఖ్యాత్, నెల్లూరు (66 పరుగులు), కిన్నుకిశాల్, నెల్లూరు (50 పరుగులు)

కడప స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగు తున్న ఏసీఏ మెన్ అండర్ 19 వన్డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా మంగళవారం కడప, కర్నూలు విజయం సాధించాయి. వివరాలిలా... కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు తొలుత ఫీల్డింగు ఎంచుకుంది. దీంతో చిత్తూరు జట్టు బ్యాటింగ్ చేపట్టి 33.1 ఓవర్లలో 124 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు కేవలం 15.4 ఓవ ర్లలో 3 వికెట్లు కోల్పోయి 128 పరుగులు సాధించింది. ఇందులో రణధీర్‌రెడ్డి 54 పరుగులు, రోహిత్‌వర్మ 37 పరుగులు చేశారు.

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టు 7 వికెట్ల తేడాతో నెల్లూరు జట్టుపై విజయం సాధించింది. తొలుత టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు 48.1 ఓవర్లలో 176 పరుగులు సాధించి ఆలౌట్ అయింది. ఇందులో కిన్నుకిశాల్ 50 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 34 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయానికి అవసరమైన 180 పరుగులు సాధించింది. ఇందులో విఖ్యాత్ 66 పరుగులు చేసి జట్టు విజయానికి దోహదపడ్డాడు.

శ్మశాన స్థలం ఆక్రమణపై ధర్నా

- భూ ఆక్రమణదారుల నుంచి విడిపించాలని డిమాండ్
- ఆర్డీవో పరిశీలన.. హద్దులు కేటాయింపు


ధర్నా నిర్వహిస్తున్న గ్రామ ప్రజలు, సీపీఎం నాయకులు, శ్మశాన స్థలాన్ని పరిశీలించి అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

బ్రహ్మంగారిమఠం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సోమిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నెం.464లో 10 ఎకరాల 5 సెంట్లు భూమిని శ్మశానవాటికకు కేటాయించారు. అయితే ఇటీవల నలుగురు వ్యక్తులు శ్మశాన స్థలాన్ని ఆక్రమించి రెవెన్యూ రికా ర్డుల్లో తమ పేర్లను ఎక్కించుకున్నారు. దాదాపు 8 ఎకరాలు ఆక్రమిం చడంతో మిగిలిని రెండు ఎకరాల్లో పది గ్రామాల ప్రజలు దహన సంస్కారాలు, అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు పడేవారు. దీనిపై గత 8 నెలలుగా గ్రామస్తులు సంబంధిత అధికా రులు, ప్రజాప్రతినిధులకు అర్జీలను సమర్పించాచారు. అయితే సరైన స్పందన లేకపోవడంతో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామ స్తులు శ్మశాన స్థలం వద్ద ధర్నా చేపట్టారు. శ్మశాన స్థలానికి పూర్తి స్థాయిలో కొలతలు నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు వెంటనే స్పందించిన ఆర్డీవో చంద్రమోహన్ అక్కడకు చేరు కొని పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం శ్మశాన స్థలానికి కొలతలు నిర్వహించి హద్దులను కేటాయించారు. రెండు మూడురోజుల్లో పూర్తిస్థాయిలో స్థలం చుట్టూ అధికారులు కంచెను ఏర్పాటు చేస్తారని తెలిపారు. కార్య క్రమంలో తహసీల్దారు రాజనరసింహ నరేంద్ర, డిప్యూటీ తహసీల్దారు జాన్సన్, వీఆర్వో సుధాకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. కాగా, అంతకు ముందు ఆక్రమణదారులు ఆర్డీవోను కలిసి తమ రికార్డులు చూపించా రు. రికార్డులను పరిశీలించిన ఆర్డీవో చంద్రమోహన్ వారితో ఎక్కడే కానీ ఈ రికార్డులకు పూర్వపు రికార్డులకు సరిపోవడం లేదని.. ఆర్ఎస్ ఆర్‌లో స్మశాన స్థలమే ఉందన్నారు. శ్మశాన స్థలాల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గండి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


నిత్యాన్నదాన పథకానికి విరాళాలు ఇస్తున్న దాతలు

చక్రాయపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో జరిగే శాశ్వత నిత్య అన్నదాన పథకానికి ప్రొద్దుటూరుకు నారాయణరెడ్డి, కళావతి దంపతులు రూ.50116, అలాగే తిరుపతి శ్రీకాళహస్తికి చెందిన కంభం సుధాకర్‌రెడ్డి, సంగీత దంపతులు రూ.50116 విరాళంగా ఇచ్చారు. దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, పూజా రులు ఆలయ మర్యాదలతో సత్కరించి ఘనంగా పూజలు చేయించారు.

వేలం ద్వారా రూ.25 వేలు ఆదాయం

కలకడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా వల్లూరు మండలంలో ఉన్న పుష్పగిరి మఠం భూములకు మంగళవారం నిర్వహించిన వేలంలో కౌలు ద్వారా రూ.25 వేలు ఆదాయం వచ్చినట్లు మఠం మేనేజర్ గిరిధర్ తెలిపారు. మఠానికి సంబంధించి కలకడ మండలంలోని నవాబ్‌పేట పంచాయతీ సర్వే నెంబరు 64లో 9.96 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. వీటి కౌలు హక్కులను వేలంలో హెచ్చుదారుగా నిలిచిన శంకర్‌నాయుడు ఏడాదికి రూ.25 వేలు చెల్లించేలా మూడేళ్లకు దక్కించుకున్నారు. మునుపు ఏడాదికి 1500 ఉన్న 23500 పెరిగి రూ.25 వేలుకు పెరిగింది. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సిద్దయ్య, దేవాదాయశాఖ అధికారి శశికుమార్, నాగభూషణ్ పాల్గొన్నారు.

యండపల్లి ఫార్మసీ అధికారి డెప్యుటేషన్ పొడిగింపు

కలికిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గతంలో కడప జిల్లాలోని యండపల్లి పీహెచ్‌సీలో ఫార్మసీ అధికారిగా పనిచేసే పి.ఉమాదేవి డెప్యుటేషన్ గడువును మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 2022లో ఆమెను యండపల్లి పీహెచ్‌సీ నుంచి డిప్యుటేషన్‌పై మంగళగిరిలోని ఏపీ వైద్య సర్వీసులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్‌లో డెప్యుటేషన్‌పై నియమించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఆమె డెప్యుటేషన్ గడువును పెంచుతూ వచ్చారు. అదే విధంగా తాజాగా మరో ఏడాది అంటే 2025-26 సంవత్సరం వరకూ నాలుగోసారి పొడిగిస్తూ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్మణి మంగళవారం డెప్యుటేషన్ పొడిగింపు ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరో రోజుకు అల్ట్రాటెక్ కార్మికుల ఆందోళన

ఎర్రగుంట్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎర్ర గుంట్ల అల్ట్రాటెక్ (ఐసీయల్) ప్యాకింగ్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న ఆందోళన మంగళవారం ఆరో రోజుకు చేరుకుంది. వేతనాలు పెంచాలని, 26రోజుల పనిదినాలు కల్పించాలని, ఇతర ఫ్యాక్టరీల మాదిరిగా ఇతర అలవెన్సులు కల్పించాలని ఆరు రోజులుగా మెయిన్‌గేటు ముందు ధర్నా చేస్తున్నారు. యాజమాన్య ఉద్యోగులు, ఇతర కాంట్రాక్టు కార్మికులను ఎవ్వరినీ లోపలికి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారు. దీంతో ప్లాంటులో పనులన్నీ బంద్ అయ్యాయి. మంగళవారం ఉదయం కూడా లోపలికి వెళ్లేందుకు వచ్చిన ప్లాంట్ యాజమాన్య ఉద్యోగులను, ఇతర కాంట్రాక్టు కార్మికులను ఆందోళనకారులు అడ్డుకున్నారు.

భక్తిశ్రద్ధలతో రౌద్రాల అంకాలమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో రౌద్రాల అంకాలమ్మ

పీలేరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత రౌద్రాల అంకాలమ్మ జాతరను మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఐదు వారాల జాతరలో భాగంగా మంగళవారం ఐదోవారం కావడంతో వేకువనే అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. జాతర చివరి వారం కావడంతో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణం సహా పరిసర ప్రాంతాల్లోని మహిళలు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని బోణాలు సమర్పించుకున్నారు. సాయంత్రం అమ్మవారిని పీలేరు వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తలి మండలి సభ్యులు కోడి రామకృష్ణారెడ్డి, హరి, ముచ్చర్ల గురునాథ్, పిట్టా భాస్కరరెడ్డి, ఆలయ పూజారులు నాగయ్య, వెంకటరమణ, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కట్టమీద గంగమ్మకు పుష్పాభిషేకం



మదనపల్లె టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తట్టివారి పల్లె పంచాయతీ లింగిశెట్టిచెరువు కట్టపై వెలసిన కట్టమీద గంగమ్మకు భక్తులు పుష్పాభిషేకం నిర్వహించారు. మంగళవారం గంగజాతర సందర్భంగా తిరుపతి వాసి సుధాకర్‌రెడ్డి, తట్టివారిపల్లె గ్రామస్థులు అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్తమరెడ్డి, మోహన్ రెడ్డి, పూజారి నవీన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

శమీ వృక్ష పూజ చేసిన లక్ష్మీనరసింహస్వామి



కలికిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 9వ రోజు మంగళవారం స్వామివారు శమీ వృక్ష పూజ నిర్వహించారు. వేకువనే అభిషేకాలు, అర్చనలు ముగించి స్వామి వారికి ప్రత్యేక అలంకరణలతో తీర్చిదిద్దారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన తిరుమంజన, పల్లకి సేవలకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంకాలం కలికిరి పెద్ద చెరువు కట్టమీద వెలసిన ఆంజనేయస్వామి ఆలయం వద్దకు అశ్వవాహనంలో తరలి వెళ్లి శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత పార్వేట ఉత్సవం నిర్వహించారు.

ఘనంగా బాలయ్య జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, బాలకృష్ణ అభిమాన సంఘం నేతలు

మదనపల్లె టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ జన్మదినం సందర్భంగా మదనపల్లెలో వేడుకలు నిర్వహించారు. నీరుగట్టువారిపల్లెలో బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు, టీడీపీ నేత ఎర్రబెల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలకృష్ణ నటనకు కేంద్రం పద్మభూషణ్ అవార్డు అందజేసిందని, ఆయన అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా వుందన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘం నేతలు బి.పురుషోత్తం, రామకృష్ణ, ప్రభాకర్, వేమయ్య, రామయ్య, జీవీ నాయుడు, గణేష్, దాము పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

నిమ్మనపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం కందూరు రోడ్డులోని ఆర్బీకేలో రైతులకు వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేసిన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిలోనే ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని తెలిపారు. అనంతరం వేరుశనగ కాయలను 30కిలోల బస్తా సబ్సిడీతో రూ.1675లకు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ శివశంకర్, హెచ్ఓ ఈశ్వర్‌రెడ్డి, ఏఓ రమేష్, తహసీల్దార్ అమరనాథ్, ఏఈఓ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సాగుభూమి పంపిణీ చేయాలి



తహసీల్దార్ అజారుద్దీన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నేతలు

బి.కొత్తకోట, జూన్10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగుభూమి లేని నిరుపేదలందరికీ భూములను పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటీయూసీ బి.కొత్తకోట మండల నేతలు నారాయణస్వామి, రఘునాథ్ డిమాండ్ చేశారు. సంఘం పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా తహసీల్దార్ అజారుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయకార్మికులకు సమగ్ర కేంద్ర చట్టాన్ని, కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని, కేరళ తరహాలో సార్వత్రిక ఆరోగ్యసంరక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు తంబయ్యశెట్టి, శంకర, గంగన్న, ప్రసాద్, నరసింహులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీకి విస్తృత ఏర్పాట్లు

స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు ● 6207 మంది విద్యార్థులకు బుక్స్, యూనిఫాం
● పాఠశాలల పునఃప్రారంభానికి సర్వం సిద్ధం : ఎంఈఓ-2 పద్మావతి

పీలేరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మండలంలో విద్యాసామగ్రి పంపిణీకి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. 12వ తేదీన పాఠశాలల పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో మండల విద్యాశాఖాధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం ఇతర విద్యాసామగ్రి అందించడం కోసం విస్తృత ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. మండలంలో 57 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, 15 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, నాలుగు గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ 6207 మంది విద్యార్థులు ఉన్నారు. ఎంఈఓ-2 పద్మావతి పర్యవేక్షణలో పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్ నుంచి మండలంలోని అన్ని పాఠశాలలకు విద్యాసామగ్రి తరలిస్తున్నారు. ఉర్దూ మీడియం మినహా మిగిలిన అన్ని తరగతులకు వంద శాతం విద్యాసామగ్రి పంపిణీకి సిద్ధమైంది. విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, మూడు జతల యూనిఫాం దుస్తులు బ్యాగ్, షూస్, సాక్సులు, టై అందిస్తున్నారు. మండలంలో 2వ తరగతి నుంచి 10 వరకూ తరగతుల వారీ విద్యార్థులు ఇలా ఉన్నారు. 2వ తరగతిలో 381 మంది, 3లో 350 మంది, 4లో 375 మంది, 5వ తరగతిలో 386 మంది, 6లో 760 మంది, 7లో 724 మంది, 8లో 891 మంది, 9లో 839 మంది, టెన్త్‌లో 886 మంది విద్యార్థులున్నారు. మండలంలోని 77 ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభానికి ముస్తాబౌతున్నాయి.

ప్రతి విద్యార్థికీ ఉచితంగా కిట్



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికీ ఉచితంగా కిట్ అందిస్తాము. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ప్రకటనలకు మోసపోకుండా విద్యార్థుల తల్లిదండ్రులు వాస్తవాలను గుర్తించి పిల్లల ఉజ్వల భవిత కోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. ప్రభుత్వ బడుల్లో క్వాలి ఫైడ్ ఉపాధ్యాయులచే కార్పొరేట్ తరహాలో విద్యాబోధన ఉచితంగా ఇస్తున్నాము. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసు కోవాలి.

పద్మావతి, ఎంఈఓ-2

పెద్దమండ్యం మండలంలో....

పెద్దమండ్యం జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి ఆయా ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అందచేస్తున్న సర్వేపల్లె రాధాకృష్ణ విద్యామిత్ర కిట్స్ పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ రామకృష్ణ వెల్లడించారు. మంగళవారం ఆయా పాఠశాలలకు సామగ్రిని పంపిణీ చేశారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన విద్యా సామగ్రిని పాఠశాలలు పునః ప్రారంభం రోజునే అందించనున్నట్లు తెలిపారు. అందుకే ఆయా పాఠశాలలకు చేరవేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



పీలేరు స్టాక్ పాయింట్‌లో పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు



పాఠశాలలకు తరలిస్తున్న విద్యా సామగ్రి

సబ్సిడీని సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే



వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద బసినికొండ రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎకరాకు బస్తా, ఎకరాపై వున్న రైతులకు రెండు బస్తాలు మాత్రమే పంపిణీ చేస్తే రైతులు ఇబ్బంది పడతారని, ఈ విషయాన్ని వెంటనే ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు పంపిణీ చేస్తున్న బస్తాలను పెంచాలన్నా రు. రైతులు కూడా ప్రభుత్వం పంపిణీ చేసిన సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకుని, వేరుశనగ సాగు చేయాలన్నారు. ఏడీఏ శివశంకర్, ఏఓ నాగప్రసాద్, తహసీల్దార్ ధనంజయులు, టీడీపీ నేతలు బాలుస్వామి, ఫణికర్‌రెడ్డి, రాటకొండ మధుబాబు, నవీన్‌చౌదరి, కత్తి లక్ష్మన్న, చుక్కా విజయ్‌కుమార్, పఠాన్ ఖాదర్ ఖాన్, జనసేన నేత జంగాల శివరామ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల అవసరాల మేరకే పంపిణీ

పీలేరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండల రైతుల అవసరాల మేరకు వేరుశనగ విత్తనాల పంపిణీ చేపడతామని పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పురం రామ్మూర్తి పేర్కొన్నారు. సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీని తన కార్యాలయంలో ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలానికి 1644 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని, డిమాండ్‌ను బట్టి మరింత వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ శాఖ అధికారి రమాదేవి మాట్లాడుతూ నారాయణి రకం విత్తనాలు 30 కిలోల బస్తా రూ.1710లు, కె-6 రకం విత్తనాలు 30 కిలోల బస్తా రూ.1674లు విక్రయిస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కమిటీ సభ్యులు అమరనాథరెడ్డి, కలప రవి, లక్ష్మీకాంతమ్మ, రమాదేవి, అనూరాధ, శివమ్మ, టీడీపీ నేతలు అమరనాథరెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, ఏఈఓ నజీర్, వీఏఏ హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పంపిణీ

వాల్మీకిపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో బుధవారం నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ చేపడుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి హేమలత తెలిపారు. ఇందుకోసం నమోదు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మండలానికి కె6 రకం విత్తనాలు 383క్వింటాళ్లు, నారాయణి రకం 870 క్వింటాళ్లు, టీసీజీఎస్ రకం 99.9 క్వింటాళ్లు కేటాయించారన్నారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ తీసుకెళ్లి సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం 40శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్న విత్తన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేషపూజలు



మదనపల్లె అర్బన్, జూ న్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డు, కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మ ఆలయంలోని గంగమ్మను ఆలయకమిటీ సభ్యులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు మాట్లాడుతూ కోర్టులో గంగమ్మ జాతరను అత్యంత వైభవంగా నిరహిచామన్నారు. అనంతరం మొదటి మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

బాలకార్మిక రహిత సమాజం కోసం కృషి చేద్దాం

మదనపల్లె టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బాల కార్మికులు లేని సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఫోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ పేర్కొన్నారు. మంగళవారం సంస్థ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

పీలేరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న స్కావెంజర్స్, స్వీపర్లకు పెండింగ్ జీతాలు సత్వరం చెల్లించాలని నియోజక వర్గ ఏఐటీయూసీ కార్యదర్శి నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ జీఓ నెంబర్ 108 ప్రకారం రూ. 12 వేలు వేతనం చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వింగ్‌లోకి ప్రస్తుతం పనిచేస్తున్న వర్కర్లను చేర్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి యశోద, వెంకట్రావమ్మ, నీరజమ్మ, సుమతి, నూర్‌జహాన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బహుజన సేన నేతలు

మదనపల్లె టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు డిమాండ్ చేశారు. సబ్‌కలెక్టరేట్ ఎదుట బహుజన సేన నేతలు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు భోజనం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టరేట్ డీఏఓకు వినతి పత్రం అందజేశారు. ఆర్‌జీఎస్ అధ్యక్షుడు కోనేటి దివాకర్, ఎస్ఎఫ్ఐ నరసింహ, బీసీ సంఘాల నేతలు సుబ్రమణ్యం, మల్లిక, సీపీఐ మురళి, మేరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి



పైడిమర్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

వాల్మీకిపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి వేడుకలను మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చేసుకున్నారు. వాల్మీకిపురం మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలలో పైడిమర్రి వెంకటసుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తూ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, కళాశాల ప్రిన్సిపాల్ రమామంజుల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయినులు

వాల్మీకిపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, మౌలిక వసతుల కల్పన మెరుగ్గా ఉంటాయని చింతపర్తి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు రిజ్వానా బేగం, ఇర్షాద్‌బేగం అన్నారు. మంగళవారం గ్రామంలో విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ అందిస్తామని, విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందిస్తామన్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి పిల్లల అభ్యున్నతికి కృషి చేయాలని వారు తల్లిదండ్రులను కోరారు.

నూతన యాజమాన్య పద్ధతులు పాటించాలి

మదనపల్లె టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రైతులు నూతన యజమాన్య పద్ధతులను పాటిస్తూ నూతన వంగడాలతో పంటసాగు చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మంజుల పేర్కొన్నారు. మంగళవారం కొత్తవారిపల్లెలో కేవీకే ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. టమోటా పంటసాగులో సమగ్ర పోషక యజమాన్య పద్ధతులు, సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏఓ నాగప్రసాద్, డాక్టర్ రమేశ్, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

నిమ్మనపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండల సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పరమేశ్వరెడ్డి పేర్కొన్నారు. ఎంపీపీ నరసింహులు ఆధ్వర్యంలో ఉదయం 11గంటలకు ఏంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందని మండల స్థాయి అధికారులు మూడు నెలలకు సంబంధించి పూర్తి డేటాతో సమావేశానికి హజరు కావాలన్నారు.

సబ్సిడీ పశుదాణ పంపిణీ

పెద్దమండ్యం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ వర్గాల పాడి ఆవు రైతులకు ప్రభుత్వం సబ్సిడీ పశుదాణ పంపిణీ చేపట్టినట్లు పెద్దమండ్యం పశు వైద్యాధికారి ఉస్మాన్ పేర్కొన్నారు. పశువైద్యాధికారి మాట్లాడుతూ పెద్దమండ్యం మండలానికి 12 టన్నుల పశుదాణ సరఫరా జరిగిందన్నారు. అర్హులైన రైతులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాలు బిల్లులు, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. 50 కిలోల బస్తా 50 శాతం సబ్సిడీతో రూ. 600 నిర్ణయించినట్లు తెలిపారు. పెద్దమండ్యం సహా వెలిగల్లు, వెలిగల్లు పశు వైద్యశాల పరిధిలో కూడా పశుదాణ పంపిణీ చేపడతామన్నారు.

వేరుశనగలో విత్తనశుద్ధిని పాటించాలి

గుర్రంకొండ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంటను సాగు చేసే రైతులు విత్తనశుద్ధిని పాటించాలని కడప జిల్లా ఉద్యాన విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ రాజానాయక్ రైతులకు సూచించారు. సంగసముద్రం రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వేరుశనగ సాగు చేసే ముందు పొలాన్ని లోతుగా దున్నాలన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో ఎరువులు, పురుగుల మందులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త మాధురి, ఏఓ రత్నమ్మ, సిబ్బంది నమీన, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేద్దాం



సురేంద్ర - రామ్మూర్తి నాయుడు

తంబళ్లపల్లె, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ఐక్యంగా కృషి చేద్దామని మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి పిలుపునిచ్చారు. టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం టీడీపీ సీనియర్ నేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో కన్నెమడుగు, ఎర్రసానిపల్లె నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. కన్నెమడుగు గ్రామాధ్యక్షుడిగా ఆర్. సురేంద్ర, ఉపాధ్యక్షుడిగా భూమిరెడ్డి, కార్యదర్శిగా శంకర్‌రెడ్డి, ఎర్రసానిపల్లె గ్రామాధ్యక్షుడిగా ఇ.రామ్మూర్తినాయుడు, ఉపాధ్యక్షుడిగా విశ్వనాథరెడ్డి, కార్యదర్శిగా కృష్ణమూర్తి, కోశాధికారిగా సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టీడీపీ పాల ఏకరి అధ్యక్షుడిగా శ్రీహరి నాయుడు

మదనపల్లె అర్బన్, జూన్10(ఆంధ్రజ్యోతి): టీడీపీ పాల ఏకరి ఎన్ఆర్ఐ కు వైట్ అధ్యక్షుడిగా శ్రీహరి నాయుడును నియమించినట్లు టీడీపీ బీసీ సాధికార సమితి పాలఏకరి రాష్ట్ర కన్వీనర్ గురిగింజ కుంట శివప్రసాద్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం నియామక పత్రాలను అందించినట్లు తెలిపారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న నేతలు

ములకలచెరువు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికులకు సాధికారిత కల్పించి సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ నేతలు నిరసన వ్యక్తం చేశారు. సంఘం మండల కార్యదర్శి నిజాం, మండల అధ్యక్షుడు వేమనారాయణ, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి అంజనప్ప మాట్లాడారు అనంతరం తహసీల్దార్ ప్రదీప్‌కు వినతి పత్రం అందజేశారు. ఉత్తన్న, లక్ష్మన్న, రెడ్డెప్ప, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయాలి

మదనపల్లె టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి పార్టీలు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలన్నీ వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కృష్ణప్ప డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీకేఎంయూ నేతలు నిరసన తెలిపారు సీపీఐ నేతలు సాంబశివ, చంద్రశేఖర్, రెడ్డెప్ప, తిరుమల, ముబారక్, రమణమ్మ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పెద్దతిప్పసముద్రం జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతి, ఇంటర్ సీట్ల భర్తీ కోసం విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు. పాఠశాల ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించేందుకు 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అవకాశమున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో 10 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకుంటారని, గతంలో పరీక్ష రాయని విద్యార్థులకు పాఠశాల స్థాయిలో 24న నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను 25న విడుదల చేస్తామని, 26న ధృవ పత్రాలను పరిశీలిస్తారన్నారు. ఈ అవకావాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.